PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 124 | విజయవాడ, మంగళవారం 5 డిసెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Tuesday 5 December 2023 | Rs

నేరాలు పెరిగి పోతున్నాయి
- ఎక్కువగా మహిళలు, చిన్నారులపైనే
- ఎస్‌సిలు, ఎస్‌టిలపై కూడా...
- ఆత్మహత్యలు, ప్రమాద మరణాలూ పెరుగుదల
- జాతీయ క్రైమ్ బ్యూరో నివేదిక విడుదల

5




క్యూబాకు మద్దతుగా ఎస్‌ఎఫ్‌ఐ పది లక్షల సంతకాల సేకరణ
- క్యూబా రాయబారికి అందజేత

5

తీవ్ర ముప్పు!

- ప్రచండగాలుల 'మిచౌంగ్' • కోస్తా అంతా రెడ్ అలర్ట్
- నిజాంపట్నం, కృష్ణపట్నంలలో 10వ నెంబర్ హెచ్చరిక
- ప్రాణ నష్టం లేకుండా చూడాలన్న సిఎం
- చెన్నై అతలాకుతలం • రాష్ట్రంలో భారీగా పంట నష్టం



తుపాన్ ప్రయాణం



నెల్లూరులో

ప్రజాశక్తి యంత్రాంగం

తీవ్ర తుపాన్‌గా మారిన 'మిచౌంగ్' ధాటికి రాష్ట్రం అతలాకుతలామౌతోంది. భారీ వర్షాలు, ఈదురుగాలులతో తీర ప్రాంతం వణుకుతోంది. పూర్తిస్థాయిలో అప్రమత్తంగా లేకపోతే తీవ్ర ముప్పు తప్పదని వాతావరణ శాఖ హెచ్చరించింది. కోస్తా అంతా రెడ్ అలెర్ట్ ప్రకటించింది. సోమవారం రాత్రి పొద్దుపోయిన తరువాత జారీ చేసిన హెచ్చరికలో తుపాన్ మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మంగళవారం ఉదయానికి బాపట్ల వద్ద తీరం దాటే అవకాశం ఉందని పేర్కొనడంతో పాటు తీరాన్ని తాకే సమయంలో భయకరంగా విరుచుకుపడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇప్పటికే తీర ప్రాంతమంతా ఈదురుగాలులు వీస్తుండగా, తీరం దాటే సమయంలో ప్రచండగాలులతో విరుచుకుపడుతుందని పేర్కొనడంతో పాటు, తీరం దాటిన తరువాత కూడా తుపాన్ ప్రభావం తీవ్రంగానే ఉంటుందని తెలిపింది. తీరం దాటే వరకు కోస్తా ప్రాంతానికి సమాంతరంగా సముద్రంలో ప్రయాణం చేస్తుందని తెలిపింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రాణనష్టం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. తుపాన్ ప్రభావ ప్రాంతాలకు ప్రత్యేక అధికారులను నియమించ డం, హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేయడం వంటి చర్యలను అధికారులు పూర్తి చేశారు. ప్రభావిత జిల్లాల్లో దాదాపు 200 పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసిన అధికారులు 10వేల మందిని తరలించారు. మరికొంత మందిని తరలించనున్నట్లు తెలిపారు. నిజాంపట్నం, కృష్ణపట్నం పోర్టుల్లో 10వ నెంబర్ హెచ్చరికను ఎగురవేశారు. దీంతో స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున ఆందోళనకు గురవుతోంది. మొత్తం 11 హెచ్చరికలు ఉండటమే దీనికి కారణం. ఇటీవల కాలంలో పదవ నెంబర్ హెచ్చరికను ఎగురవేయలేదని, ఇది పరిస్థితి తీవ్రతను తెలియచేస్తోందని అంటున్నారు. మరోవైపు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో సముద్రపు అలలు విరుచుకుపడుతున్నట్లు సమాచారం అందింది. పలు ప్రాంతాల్లో సముద్రం కొన్ని అడుగుల మేర ముందుకు వచ్చింది. ఆది, సోమ వారాల్లో కురిసిన వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంట నష్టపోయింది. కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

70 ఏళ్లలో లేని వర్షం

సోమవారం కురిసిన వర్షంతో చెన్నై నగరం పూర్తిగా జలమయమైంది. ఎక్కడ చూసినా నీళ్లే కనిపిస్తున్నాయి. గత 70-80 ఏళ్లలో ఎన్నడూ చూడని వర్షం కురిసిందని ఆ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.ఎన్ నెహ్రూ అన్నారు. తుపాన్ విలయం ముందు తమ ప్రభుత్వం విఫలమైందని ఆయన చెప్పారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నా అవి చాలలేదని ఆయన అన్నారు. చెంగల్పట్టు, తిరువళ్లూరు, కాంచీపురం జిల్లాలోనూ భారీ వర్షం కురిసింది.



కృష్ణా జిల్లా పునాదిపాడులో నీటమునిగిన వరిపంటలను చూపుతున్న రైతు

సహాయక చర్యలు చేపట్టాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వరి కోతల సమయంలో తుపాను ముంచుకురావడంతో కోస్తా జిల్లాల ప్రజానీకం, రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోందని, తక్షణం రాష్ట్ర ప్రభుత్వం అన్ని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. తుపాను వల్ల రైతులకు, ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని, బాధిత ప్రజలను ఆదుకోవాలని కోరింది. అలాగే పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలబడి అవసరమైన సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.



సిఎల్‌పి సమావేశంలో మాట్లాడుతున్న డికె శివకుమార్, చిత్రంలో రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క తదితరులు

అధిష్టానం ఇష్టానికే...

ఢిల్లీ చేరిన తెలంగాణ సిఎం ఎంపిక ప్రక్రియ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో నూతన ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ మరింత ఆలస్యం కానుంది. ఎల్లా హోటల్‌లో సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌ఏల సమావేశంలో శాసనసభ పక్ష నేతను ఎంపిక చేసే అధికారం అధ్యక్షుడు ఖర్గేకు అప్పగిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. అయితే, సాయంత్రం వరకు అధిష్టానం నుండి ఎటువంటి సమాచారం రాకపోవడంతో పాటు ఎఐసిసి తరపున హాజరైన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌తో పాటు, ఇతర పరిశీలకులను తక్షణమే ఢిల్లీకి రావాలని ఆదేశాలు అందాయి. దీంతో హుటాహుటిన ప్రత్యేక విమానంలో వారు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అధిష్టానంతో చర్చల అనంతరం నేడు (మంగళవారం) తుది నిర్ణయం వెలువడుతుందని, బుధవారం (ఆరవ తేది) ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. అప్పటికి కూడా ఖరారు కాకపోతే పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గతంలోనే ప్రకటించిన విధంగా తొమ్మిదవ తేది (సోనియాగాంధీ జన్మదినం) న ప్రమాణ స్వీకారం ఉంటుందని సమాచారం. కర్ణాటకలో యడ్యూరప్ప, డికె శివకుమార్ మధ్య చోటుచేసుకున్న గ్రూపు రాజకీయాల కారణంగా శాసనసభ పక్ష నేతను ఎన్నుకోవడానికి దాదాపు వారం రోజుల సమయం పట్టిన సంగతి తెలిసిందే. తెలంగాణలోనూ ఆ తరహా పరిణామాలే చోటుచేసుకుంటున్నట్టుగా సమాచారం. వాస్తవానికి నూతన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరు ఖరారైనట్టు సోమవారం ఉదయం నుండి విస్తృతంగా ప్రచారమైంది. గవర్నర్ కార్యాలయానికి కూడా సమాచారం వెళ్లడంతో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు కూడా పూర్తిచేశారు. పోలీస్ హడావిడి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దీంతో ఎంఎల్‌ఏల సమావేశం లాంఛనమే అన్న అభిప్రాయం కూడా వ్యక్తమైంది. అయితే, కాంగ్రెస్‌లో మరోరకమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే ఎంఎల్‌ఏలు అందరూ ఎల్లా హోటల్‌కు చేరుకున్నప్పటికీ సమావేశం ప్రారంభం కాలేదు. ఎంఎల్‌ఏలు ఎదురుచూస్తుండగా డికె శివకుమార్ పార్క్ హయత్ హోటల్‌లో సీనియర్ కాంగ్రెస్ నేతలు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి సోదరులతో సమావేశమైనారు. ఈ సమావేశంలో రేవంత్‌రెడ్డి పాల్గొనలేదు. ఈ సమావేశం జరుగుతుండగానే ఎఐసిసి పరిశీలకులు ఎల్లా హోటల్‌లో ఎంఎల్‌ఏలను విడివిడిగా కలిసి అభిప్రాయాలు సేకరించారు. ఆ తరువాత జరిగిన సిఎల్‌పి సమావేశంలో అధ్యక్షుడు ఖర్గేకు సిఎల్‌పినేతను నియమించే బాధ్యతను అప్పగిస్తున్నట్లు ఏకవాక్య తీర్మానం చేసి ఢిల్లీకి పంపారు. నిర్ణయం వెలువడుతుందని భావిస్తున్న సమయంలో శివకుమార్‌తో పాటు పరిశీలకులను ఢిల్లీకి తక్షణమే రావాలంటూ ఆదేశాలు అందాయి. పార్లమెంటు సమావేశాల కారణంగా ఖర్గే ఈ వ్యవహారంపై మిగతా 2లో

ఆరోగ్యశ్రీపై ముమ్మర ప్రచారం

- ఆస్పత్రుల్లో ఖాళీలు భర్తీ చేయాలి • సమీక్షలో సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్యశ్రీ పథకంపై ముమ్మరంగా ప్రచారం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం వైద్యారోగ్యశాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ సేవలను ఏ విధంగా వినియోగించుకోవాలన్న అంశంపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఆరోగ్యశ్రీపై సిహెచ్‌ఒలు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గుర్తించిన రోగులకు నిరంతరం చేయుతనివ్వాలన్నారు. రోగులకు మందులు అందించడం అనంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేసుకున్న వారికి అవసరమైన మందులు, ఆపరేషన్ చేయించాలన్నారు. చికిత్స అవసరమైన వారిని ఆస్పత్రులకు పంపించేటప్పుడు వారికి రవాణా ఖర్చులు కింద రూ.500 ఇవ్వాలన్నారు. కంటి చికిత్సలు కాకుండా, ఇతర వైద్య చికిత్సలు అవసరమైన వారు 86,690 మంది ఉన్నారన్నారు. ఇందులో 73,602 మందిని ఇప్పటికే చికిత్సకు ఆస్పత్రులకు తరలించారన్నారు. 13,614 మందికి



ఇప్పటికే కాటరాక్ట్ చికిత్సలు చేయించామన్నారు. అలాగే 5,26,702 మందికి కంటి అద్దాలు అందిస్తున్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రతి గ్రామానికీ వెళ్తున్నారని, మందులు కూడా అందుబాటులో ఉంచామని అధికారులు తెలిపారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను అందరికీ అందుబాటులో ఉండేలా చూస్తున్నట్లు అధికారులు వివరించారు.

18 నుంచి కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు

ఈ నెల 18 నుంచి కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అధికారులు తెలిపారు. 1.42 లక్షల కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు వేగంగా ప్రింట్ అవుతున్నాయని చెప్పారు.

రాజ్యసభలో పోస్టాఫీస్ సవరణ బిల్లు

- లోక్‌సభలో న్యాయవాదుల బిల్లు ఆమోదం
- లోక్‌సభలో ప్రవేశపెట్టిన తెలంగాణ గిరిజన యూనివర్శిటీ బిల్లు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభలో పోస్టాఫీస్ సవరణ బిల్లు, లోక్‌సభలో న్యాయవాదులు సవరణ బిల్లు ఆమోదం పొందాయి. రాజ్యసభలో పోస్టాఫీస్ సవరణ బిల్లును కేంద్ర ఐటి మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం ప్రవేశపెట్టారు. దేశంలోని తపాలా కార్యాలయానికి సంబంధించిన చట్టాన్ని ఏకీకృతం చేయడం, సవరించడం, దానితో అనుసంధానించడమే ఈ బిల్లు లక్ష్యమని మంత్రి తెలిపారు. పోస్టాఫీసుల ప్రైవేటీకరణకే ప్రభుత్వం ఇదంతా చేస్తోందని బిల్లుపై జరిగిన చర్చలో పలువురు ఎంపిలు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు లోక్‌సభ న్యాయవాద వృత్తిని నియంత్రించేందుకు ఉద్దేశించిన బిల్లును ఆమోదించింది. ఈ బిల్లును లోక్‌సభలో కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. న్యాయవాద వృత్తిని ఒకే చట్టం ద్వారా క్రమబద్ధీకరించాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. దేశంలోని న్యాయస్థానాలలో దూషణల పాత్ర ఉండకూడదని పేర్కొన్నారు. బిల్లుపై చర్చ సందర్భంగా పలువురు ఎంపిలు సవరణల్లోని లోపాలను ఎత్తి చూపారు.

రెండు దశల్లో ఏడేళ్లలో గిరిజన యూనివర్సిటీ

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు గిరిజన యూనివర్శిటీని రూ.889.07 కోట్లతో రెండు దశల్లో ఏడేళ్లలో నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. ఈ యూనివర్శిటీ ఉన్నత విద్య నాణ్యతను పెంచుతుందని తెలిపారు. తెలంగాణలోని సమ్మక్క సారక్క సెంట్రల్ గిరిజన యూనివర్శిటీ ఏర్పాటుకు సంబంధించిన సెంట్రల్ యూనివర్శిటీ సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రవేశపెట్టారు. వరంగల్ జిల్లా ములుగులో సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీని ఏర్పాటు చేయనున్నారు.

శాస్త్రవేత్త స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వాలి

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ అంత్యక్రియలకు కేంద్రప్రభుత్వ ప్రతినిధి ఎవరూ హాజరు కాకపోవడం ఆయనను అగౌరవ పరచడమేనని, ఆయనకు భారతరత్న ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపి కె సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం లోక్‌సభలో జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తారు. కొత్త పార్లమెంట్ భవనంలో స్వామినాథన్ విగ్రహాన్ని, సెంట్రల్ హాల్‌లో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆహార రంగంలో స్వయం .సమృద్ధిని సాధించడంలో ఆయన చేసిన కృషిని గుర్తించాలని, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసిఎఆర్)కు ఆయన పేరు మార్చాలని ప్రభుత్వాన్ని సురేష్ డిమాండ్ చేశారు.

ఉత్తరాఖండ్ సొరంగం ఘటనపై న్యాయ విచారణ జరపాలి : సిపిఎం

ఉత్తరాఖండ్ సొరంగం ఘటనపై న్యాయ విచారణ జరపాలని సిపిఎం రాజ్యసభ ఎంపి వి.శివదాసన్ డిమాండ్ చేశారు. సోమవారం రాజ్యసభలో జీరో అవర్‌లో సిపిఎం ఎంపి వి. శివదాసన్ ఉత్తరాఖండ్‌లో కూలిన సిల్క్యారా సొరంగం ఘటనపై విచారణ మిగతా 5లో

ఖర్చు ఆధారంగానే కేటాయింపులు
- బడ్జెట్ మార్గదర్శకాలు విడుదల
- పెట్టుబడి వ్యయానికి ప్రాధాన్యత

ఇండోనేషియాలో పేలిన అగ్నిపర్వతం
- 11మంది మృతి, 3వేల మీటర్ల ఎత్తున బూడిద మేఘాలు

ఉద్యోగ భద్రత ఏదీ?
- కదం తొక్కిన సమగ్ర శిక్షా ఉద్యోగులు
- కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

లోపలి పేజీలో..

మణిపూర్‌లో మళ్లీ హింస..

- 13 మంది మృతి

న్యూఢిల్లీ: మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. టెంగ్‌నౌపాల్ జిల్లా సైబాల్ సమీపంలోని లీతూ గ్రామంలో రెండు తెగలకు చెందిన జనం మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరినొకరు కర్రలు, రాళ్లతో కొట్టుకున్నారు. తుపాకులతో కాల్చుకు న్నారు. ఈ ఘర్షణల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఘర్షణలు జరుగుతున్నట్లు సమాచారం అందగానే తాము ఘటనా ప్రాంతానికి వెళ్లామని, అప్పటికే అక్కడ 13 మృతదేహాలు పడి ఉన్నాయని భద్రతాధికారులు తెలిపారు. ఈ ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారు లీతూ గ్రామానికి చెందిన వారు కాదని అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. వేరే ప్రాంతం నుంచి వచ్చిన ఈ గ్రూప్.. గ్రామంలోని మరో తెగకు చెందిన గ్రూప్‌తో ఘర్షణకు దిగిందని భద్రతాధికారులు చెప్తున్నారు. స్థానికులు కాకపోవడంతో మరణించిన 13 మంది ఎవరనేది ఇంకా గుర్తించలేదు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఏడాది మే 3 నుంచి మణిపూర్‌లోని మైతీ, కుకీ తెగల మధ్య చెలరేగిన ఘర్షణల్లో 182 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

మనువాద శక్తులపై ఐక్య పోరు

దళిత, వ్యవసాయ కార్మిక సంఘాల పార్లమెంటు మార్చ్‌లో వక్తల పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కొత్త భవిష్యత్తు నిర్మాణం కోసం 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని దళిత హక్కుల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. దళితుల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోరుతూ సోమవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద వేలాదిమంది దళితులు, వ్యవసాయ కార్మికులు పార్లమెంట్ మార్చ్ నిర్వహించారు. దేశ నలుమూలల నుండి వేలాది మంది కార్యకర్తలు ప్లకార్డులు చేబూని రాజధానిలో కదం తొక్కారు. సిపిఎం ఎంపిలు జాన్ బ్రిట్టాస్, శివదాసన్, సిపిఐ ఎంపిలు ఎం సెల్వరాజు, బినయ్ విశ్వం, ఆర్‌జెడి ఎంపి మనోజ్ కుమార్ ఝా సంఘీభావం తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా నుంచి హన్నన్ మొల్లా, ఎఐకెఎస్ నుంచి కృష్ణప్రసాద్, సెంట్రల్ ట్రేడ్ యూనియన్ల ఉమ్మడి వేదిక నుంచి సుకుమార్ ధామ్లే మద్దతు ప్రకటించారు. దళిత హక్కుల కోసం పనిచేస్తున్న సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు మద్దతు తెలిపారు. డిఎస్‌ఎంఎం ప్రధాన కార్యదర్శి రామచంద్ర డోమ్, ఎఐఎడబ్ల్యుయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయరాఘవన్, బి వెంకట్, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణీ అలీ, జిఎస్ గోరియా, విఎస్ నిర్మల్, పాల్ దివాకర్, శ్రీరామ్ చౌదరి, రాహుల్,



దళిత, వ్యవసాయ కార్మిక సంఘాల పార్లమెంటు మార్చ్‌లో మాట్లాడుతున్న ఎఐఎడబ్ల్యుయు అధ్యక్షులు విజయరాఘవన్

అధియమాన్, బీనా పల్లికల్, సూర్యకాంత్ పాశ్వాన్, అభిరమ్య, దేవి రాణి, కురబి వినయ్ కుమార్ మాట్లాడారు. కేంద్రంలోను, బిజెపి పాలిత రాష్ట్రాల్లోను దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని,ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. దళిత మహిళలు, బాలికలపై దాడులకు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. 'బిజెపిని ఓడించాలి, భవిష్యత్‌ను నిర్మించాలి' అన్న నినాదాలతో ప్రదర్శన హోరెత్తింది. ఈ కార్యక్రమంలో కె సోమప్రసాద్, మల్లేపల్లి లక్ష్మయ్య, ధీరేంద్ర ఝా, కర్నైల్ సింగ్, ఎన్ సాయిబాలాజీ, విక్రమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి 11 డిమాండ్లతో వినతి

రాష్ట్రపతికి 11 డిమాండ్లతో కూడిన లక్షలాది సంతకాలతోకూడిన విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. గ్రామీణ, పట్టణ ఉమ్మడి ఆస్తి వనరుల కేటాయింపు, వినియోగంలో దళితులకు సమానమైన మిగతా 5లో

మిజోరంలో జెడ్‌పిఎం ఘన విజయం

మూడు దశాబ్దాల రెండు కూటముల వ్యవస్థకు తెర


ముఖ్యమంత్రి పీఠంపై కొత్త ముఖం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో/ ఐజ్వాల్:

ఈశాన్య రాష్ట్రం మిజోరంలో మాజీ ఐపిఎస్ అధికారి లాల్ దహోమా నేతృత్వంలోని జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పిఎం) ఘన విజయం సాధించింది. అధికార మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్) ఘోర పరాజయాన్ని చవిచూసింది. గత మూడు దశాబ్దాలుగా మిజోరం రాజకీయాల్లో రాటుదేలిన యోధుడు 79 ఏళ్ల లాల్ దహోమా రూపంలో మిజోరం కొత్త ముఖ్యమంత్రిని చూడబోతోంది. 35 ఏళ్ల పాటు మిజోరంలో అధికార మార్పిడి ఎంఎన్‌ఎఫ్, కాంగ్రెస్‌ల మధ్యే సాగుతూ వచ్చింది. ఇప్పుడు ఆ రెండు కూటముల వ్యవస్థకు తెర దించుతూ ప్రత్యామ్నాయంగా జెడ్‌పిఎం ముందుకొచ్చింది.40 స్థానాలున్న మిజోరం అసెంబ్లీకి నవంబరు 7న పోలింగ్ జరగ్గా.. 80

ఎన్నికల్లో వచ్చిన సీట్లు, ఓట్లు

పార్టీ	సీట్లు	ఓట్లు (శాతం)
జెడ్‌పిఎం	27	37.86
ఎంఎన్‌ఎఫ్	10	35.10
బిజెపి	2	5.06
కాంగ్రెస్	1	20.82



శాతానికి పైగానే పోలింగ్ నమోదైంది. జెడ్‌పిఎం 27, ఎంఎన్‌ఎఫ్ 10, బిజెపి 2, కాంగ్రెస్ 1 స్థానంలో గెలుపొందాయి.గత ఎన్నికలతో పోల్చితే జెడ్‌పిఎంకు 19 సీట్లు, బిజెపికి 1 సీటు పెరగ్గా, ఎంఎన్‌ఎఫ్‌కు 16 సీట్లు, కాంగ్రెస్‌కు 4 సీట్లు తగ్గాయి. జెడ్‌పిఎంకు 15.77 శాతం ఓట్లు పెరగ్గా, ఎంఎన్‌ఎఫ్‌కు 2.6 శాతం, కాంగ్రెస్‌కు 9.16 శాతం, బిజెపికి 3.03 శాతం ఓట్లు తగ్గాయి.

ముఖ్యమంత్రి జోరంతంగ ఓటమి

మిజోరం ముఖ్యమంత్రి, ఎంఎన్‌ఎఫ్ అధ్యక్షులు జోరంతంగ ఐజ్వాల్ ఈస్ట్-1 నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇది ఎంఎన్‌ఎఫ్‌కి పెద్ద ఎదురుదెబ్బగా చెప్పొచ్చు. ఉపముఖ్యమంత్రి తౌన్‌లూయా, ఆరోగ్య మంత్రి ఆర్ లాల్తాంగ్లియానా, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి లరుత్కిమా కూడా ఓటమి పాలయ్యారు.

తుపాను ప్రభావిత జిల్లాల ప్రత్యేకాధికారులు వీరే

బాపట్ల	కాటమనేని భాస్కర్
అంబేద్కర్ కోనసీమ	జయలక్ష్మి
తూర్పుగోదావరి	వివేక్ యాదవ్
కాకినాడ	యువరాజ్
ప్రకాశం	ప్రద్యుమ్న
నెల్లూరు	హరికిరణ్
తిరుపతి	జె శ్యామలరావు
పశ్చిమగోదావరి	కన్నబాబు

దక్షిణ మధ్య రైల్వే హెల్ప్‌లైన్ సెంటర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మిచౌంగ్ తుపాను నేపథ్యంలో రైల్వే ప్రయాణికులకు మెరుగైన సమాచారం అందించేందుకు దక్షిణ మధ్య రైల్వే పలు స్టేషన్లలో హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఆయా సెంటర్ల హెల్ప్‌లైన్ నెంబర్లను సోమవారం విడుదల చేసింది.
అనకాపల్లి: 08924-221698,
తుని: 08854-252172,
సామర్లకోట: 08842-327010,
రాజమండ్రి: 08832-420541,
తాడేపల్లిగూడెం: 08818-226162,
ఏలూరు : 08812-232267,
భీమవరం టౌన్: 08816-230098, 7815909402,
విజయవాడ: 08862-571244,
తెనాలి: 08644-227600,
బాపట్ల: 08643-222178,
ఒంగోలు: 08592-28036,
నెల్లూరు: 0861-345863,
గూడూరు: 08624-250795, 7815909300,
కాకినాడ టౌన్: 08842-37427,
గుంటూరు: 9701379072,
రేపల్లె: 7093998699,
కర్నూలు సిటీ: 08518220110,
తిరుపతి: 7815915571,
రేణిగుంట: 9493548008ను కేటాయించారు. వీటితోపాటు కమర్షియల్ కంట్రోల్ పాయింట్‌ను సికింద్రాబాద్‌లో ఏర్పాటుచేశారు. సికింద్రాబాద్ : 0402780112, హైదరాబాద్ : 9676904334, కాచిగూడ: 040-27784453, కాజీపేట: 0870-2576430, ఖమ్మం: 7815955306 నెంబర్లను సమాచారం కోసం సంప్రదించవచ్చని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.

పోస్టల్ సేవలను డిజిటలైజ్ చేయాలి : విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సంప్రదాయ పద్ధతుల్లో సాగుతున్న పోస్టల్ సర్వీసులను డిజిటలైజ్ చేయడం ద్వారా ప్రజలకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు విస్తృత రీతిలో సేవలు అందించవచ్చని ప్రభుత్వానికి వైసిపి ఎంపి వి విజయసాయి రెడ్డి సూచించారు. మనీ ఆర్డర్లకు బదులుగా మొబైల్ పేమెంట్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. చిన్న మొత్తాల పొదుపు కార్యకలాపాలను పేమెంట్స్ బ్యాంక్‌కు బదలాయించాలని కోరారు. పోస్ట్ ఆఫీసు బిల్లుపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్ని పోస్టాఫీసులను కంప్యూటరైజ్ చేసి పోస్టల్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ట్రైన్ టిక్కెట్ల రిజర్వేషన్, ఆధార్ నమోదు, అప్‌డేట్ సేవలను పోస్టాఫీసుల్లో అందుబాటులోకి తెచ్చేలా సెంట్రలైజ్డ్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని పేర్కొన్నారు. పేదల కోసం ఉద్దేశించిన సబ్సిడీలు సంపన్న వర్గాలు అనుభవించకుండా నిరోధించేందుకు పోస్టల్ రేట్లను హేతుబద్ధం చేయాలన్నారు.

పాలిటెక్నిక్ ఫార్మసీలో మిగిలిన సీట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిటెక్నిక్ కళాశాలల్లోని డి ఫార్మసీ కోర్సుల్లో సీట్లు భారీగా మిగిలాయి. ఉన్న సీట్లలో కేవలం 17.44 శాతమే భర్తీ అయ్యాయి. 82.56 సీట్లు భర్తీ కాలేదు. డి ఫార్మసీ కోర్సులకు సంబంధించిన ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్ సోమవారంతో ముగిసింది. మొత్తం 48 కళాశాలల్లో 3,044 సీట్లు ఉండగా, 531 భర్తీ అయ్యాయి. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ప్రవేశాల కన్వీనర్ సిహెచ్ నాగరాణి ఒక ప్రకటన విడుదల చేశారు. 9 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 506 సీట్లు ఉండగా 223 భర్తీ అయ్యాయి. 39 ప్రైవేట్ కళాశాలల్లో 2,538 సీట్లు ఉండగా 308 మాత్రమే భర్తీ అయ్యాయి. మొత్తం 762 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు అర్హత సాధించగా 547 మంది హాజరయ్యారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన 540 మందిలో 531 మంది ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారు. తరగతులు మంగళవారం నుంచే ప్రారంభమవుతాయని, సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోపు ఆయా కళాశాలల్లో వ్యక్తిగతంగా రిపోర్టు చేయాల్సి ఉంటుందని కన్వీనర్ తెలిపారు.

అధిష్టానం ఇష్టానికే...

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం దృష్టి సారించలేదని చెబుతున్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరగాల్సిఉంది. దాని తరువాత తెలంగాణ వ్యవహారంపై దృష్టి సారిస్తారని, ముఖ్యమంత్రితో పాటు, మంత్రి వర్గాన్ని కూడా ఖరారు చేస్తారని చెబుతున్నారు.

బిఆర్ఎస్ శాసనసభ పక్ష నేత ఎవరో...!

బిఆర్ఎస్ శాసనసభ పక్షనేతపై కూడా సస్పెన్స్ నెలకొంది. బిఆర్ఎస్ ఎంఎల్ఏల సమావేశం ఒక హోటల్‌లో సోమవారం జరిగింది. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం జరుగుతుండగానే ఎంఎల్ఏల నందర్నీ ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి రమ్మంటూ కెసిఆర్ నుండి పిలుపు వచ్చింది. దీంతో శాసనసభ పక్ష నేత ఎన్నిక ఉంటుందని భావించారు. ఏం జరుగుతుందో వేచి చూద్దామని, శాసనసభ పక్ష నేతను త్వరలో ఎన్నుకుందామని, ఎన్నికల ఫలితాలపై కూడా త్వరలో సమీక్షిస్తామని ఆయన చెప్పారని సమాచారం.

ప్రాణ నష్టం జరగకుండా చూడాలి

- అత్యవసర ఖర్చుల కోసం జిల్లాకు రూ.2 కోట్లు
- గుడిసెలు, ఇళ్లు నష్టపోయిన వారికి రూ.10 వేలు
- పునరావాస క్యాంపుల్లో అన్ని వసతులూ కల్పించాలి
- జిల్లాలకు ప్రత్యేక అధికారులుగా సీనియర్ ఐఎఎస్‌లు
- కలెక్టర్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష



క్యాంపు కార్యాలయంలో కలెక్టర్లు, ఎస్‌పిలు, ఇతర ఉన్నతాధికారులతో సిఎం జగన్మోహన్‌రెడ్డి సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మిచౌంగ్ తుపాను వల్ల మనుషులతోపాటు పశువులకూ ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కలెక్టర్లు, ఎస్‌పిలు, ప్రభుత్వ యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండి, జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. తుపాను నేపథ్యంలో చేపడుతున్న సహాయ, పునరావాస కార్యక్రమాలపై 8 జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, ఇతర ఉన్నతాధికారులతో క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తుపాను మంగళవారం మధ్యాహ్నం తీరం దాటే అవకాశం ఉందని ఐఎండి అధికారులు చెబుతున్నారని, గంటకు 110 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని చెబుతున్నారన్నారు.

తుపానులో దెబ్బతిన్న గుడిసెలు, ఇళ్లకు తక్షణ సహాయంగా రూ.10 వేలు ఇచ్చి మనావతా దృక్పథంతో సహాయం చేయాలని అధికారులను ఆదేశించారు. వారు కొత్త నివాసం ఏర్పాటు చేసుకునేటట్లు సానుభూతితో సహకారం అందించాలన్నారు. పునరావాస కేంద్రం నుంచి బాధితులు ఇంటికి వెళ్లేటప్పుడు ఒక్కొరికైతే రూ.వెయ్యి, కుటుంబానికైతే రూ.2,500 చొప్పున ఇవ్వాలన్నారు.

తుపాను పునరావాస చర్యలు పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకూ సీనియర్ ఐఎఎస్ అధికారిని నియమించామని, వీరు జిల్లాల్లో యంత్రాంగంతో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తారని, సోమవారం సాయంత్రం నుంచి జిల్లాల్లో అందుబాటులో ఉంటారని సిఎం తెలిపారు. అత్యవసర ఖర్చుల కోసం ప్రతి జిల్లాకూ రూ.2 కోట్లు చొప్పున నిధులివ్వాలని ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు.

కోతలు వాయిదా వేసుకోవాలి

తుపాను నేపథ్యంలో కోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు తెలపాలన్నారు. ఇప్పటికే కోసిన పంటను కచ్చితంగా సేకరించాలని సిఎం సూచించారు. తుపాను ప్రభావం ఉన్న ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఎక్కడ అవసరమనుకుంటే అక్కడ వేగంగా పునరావాస శిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సిఎంకు అధికారులు వివరణ ఇస్తూ.. ఇప్పటికే 8 జిల్లాల్లో 181 సహాయ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

5 ఎన్‌డిఆర్ఎఫ్, మరో 5 ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు సహాయక కార్యక్రమాల కోసం సిద్ధంగా ఉన్నాయన్నారు. తుపాను తీరం దాటిన తర్వాత పంట నష్టంపై ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని, అందుకోసం కొంత సమయం ఇచ్చిన తర్వాత తాను బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తానని సిఎం అన్నారు.

అమరావతి అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతే అని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిన దృష్ట్యా అమరావతి అభివృద్ధికి వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఇప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్ రాజధానిపై నోరు మెదపకుండా తుంపులు పెట్టి తమాషా చూసిన కేంద్ర ప్రభుత్వం.. పార్లమెంటులో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని స్పష్టంగా ప్రకటన చేసినందున ఇప్పటికైనా నాటకాలకు స్వస్తి చెప్పి అమరావతి అభివృద్ధికి పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఆ మేరకు ఈ సెషన్‌లోనే ప్రకటన చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పార్లమెంటులో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలి

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు రాష్ట్రం నుంచి ఎన్నికైన పార్లమెంటు సభ్యులు కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మరో ప్రకటనలో కోరారు. ఇటీవల కృష్ణా జల వివాదాన్ని పెంచడంతో సహా అన్ని విధాలా రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టే బిల్లులన్నింటికీ మద్దతునివ్వాలని తమ పార్టీ ఎంపిలను ముఖ్యమంత్రి ఆదేశించడం సరైంది కాదని పేర్కొన్నారు. సిఎం నిర్ణయం రాష్ట్ర ప్రయోజనాలకు నష్టకరమని తెలిపారు. వైసిపి, టిడిపి తరపున రాష్ట్రం నుండి ఎన్నికైన ఎంపిలు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు ప్రయత్నించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న ద్రోహాన్ని ఎండగట్టాలని కోరారు. రాష్ట్రాభివృద్ధికి, కరువు సహాయానికి నిధులు రాబట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు నష్టం చేసే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు షరతుతో సహా విద్యుత్ సంస్కరణల బిల్లును తిరస్కరించాలని కోరారు.

రాజధానిని విశాఖకు తరలించే యత్నాలను విరమించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని అమరావతేనని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రకటన చేసినందున రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విశాఖపట్నంకు ప్రభుత్వ కార్యాలయాల తరలింపును మానుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యుత్తు ప్రమాదాల పట్ల అప్రమత్తం

- ఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖ) : మిచౌంగ్ తుపాను ప్రభావంతో వర్షాలు, గాలుల కారణంగా కలిగే విద్యుత్తు ప్రమాదాలు, అంతరాయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని వినియోగదారులకు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇమ్మడి విజ్ఞప్తి చేశారు. ప్రమాదాలు, అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912కు తెలియజేయాలని సూచించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయంనుంచి ఎప్పటికప్పుడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ విద్యుత్తు పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సంస్థ డైరెక్టర్లకు, ఐదు సర్కిళ్ల అధికారులకు అవసరమైన సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. తుపాను సహాయక కేంద్రాలకు, హాస్పిటళ్లకు తప్పనిసరిగా విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవా లని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల ఎస్ఇలను ఆదేశించారు. తుపాను ప్రభావానికి తెగిపడే విద్యుత్ వైర్లను, విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేయడానికి అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను, సిబ్బందిని అప్రమత్తంగా, అందుబాటులో



ఉంచాలని సూపరింటెం డింగ్ ఇంజినీర్లకు ఆదేశాలిచ్చారు. డైరెక్టర్ ఆపరేషన్స్ బి.రమేష్ ప్రసాద్ రాజమండ్రి సర్కిల్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఎవివి.సూర్య ప్రతాప్ ఏలూరు సర్కిల్‌లో పునరుద్ధరణ చర్యల ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

కంట్రోలు రూములు ఏర్పాటు

వినియోగదారుల నుంచి వచ్చే విద్యుత్తు అంతరాయాల ఫిర్యాదులను, సమస్యలను నమోదు చేసుకునేందుకు ఐదు జిల్లాల్లో కంట్రోలు రూములు ఏర్పాటు చేశామని సిఎండి పృథ్వీతేజ్ తెలిపారు. తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, స్తంభాలపైన, లైన్లపైన పడిపోయిన చెట్లు/చెట్లకొమ్మల పట్ల, పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, వాటి సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1912, వాట్సాప్ చాట్ నెంబర్ 8500001912, కంట్రోలు రూమ్ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని సిఎండి విజ్ఞప్తి చేశారు.

సహాయక చర్యలపై దృష్టిపెట్టాలి : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంపై మిచౌంగ్ తుపాను ప్రభావం తీవ్రంగా ఉంటుందనే సమాచారం ఆందోళన కలిగిస్తోందని, ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కోరారు. పక్కా ప్రణాళిక ద్వారా అన్నదాతలకు నష్టం జరగకుండా చూడాలని సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గతంలో అకాల వర్షాల కారణంగా ధాన్యం రైతులు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం తగురీతిలో స్పందించలేదని విమర్శించారు. ధాన్యాం కొనుగోలులో ఆంక్షలు తొలగించాలన్నారు. టిడిపి కార్యకర్తలు, నేతలు తుపాను బాధితులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : లోకేష్

తుపాను ముప్పు పొంచి ఉందని విపత్తుల సంస్థ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మరో ప్రకటనలో సూచించారు. సహాయక చర్యల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. తుపాను తీవ్రత దృష్ట్యా యువగళం పాయదాత్రకు విరామం ప్రకటించినట్లు పేర్కొన్నారు.

హైకోర్టు ఆవరణలో ఎస్ఐ అభ్యర్థులకు నేడు ఎత్తు కొలతలు

ప్రజాశక్తి-అమరావతి

వ్యాజ్యాలను దాఖలు చేసిన ఎస్ఐ అభ్యర్థుల ఎత్తు కొలత ప్రక్రియ హైకోర్టు ఆవరణలో మంగళవారం జరగనుంది. హైకోర్టులోని డిస్పెన్సరీ వైద్యులు కొలతలు కొలిచేందుకు సిద్ధంగా ఉండాలంది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ జి నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశించింది. 2018 నాటి ఎస్ఐ నోటిఫికేషన్ ప్రకారం ఎత్తు కొలతల్లో అర్హత సాధించామని, 2023 నోటిఫికేషన్‌లో ఎత్తు కొలతల్లో అనర్హులుగా ప్రకటించడం అన్యాయమని 24 మంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. తదుపరి ఉత్తర్వుల జారీ వరకు ఎస్ఐ పోస్టుల ఎంపిక ఫలితాలను ప్రకటించొద్దని గతంలో సింగిల్ జడ్జి ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డులు అప్పీల్ దాఖలు చేశాయి. పిటిషనర్ల అభియోగం అవాస్తవమైతే ఒక్కో పిటిషనరుకు రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తామని డివిజన్ బెంచ్ హెచ్చరికలను జారీ చేసింది. 24 మందిలో 19 మంది పిటిషనర్లు స్వాగతించారు. దీంతో మంగళవారం హైకోర్టు ఆవరణలో 19 మంది పిటిషనర్లకు ఎత్తు కొలతల ప్రక్రియ జరగనుంది. కొలతల సమయంలో పోలీసు నియామక బోర్డు ఛైర్మన్, ఆరుగురు కమిటీ సభ్యులు హైకోర్టుకు హాజరవుతారని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. దీంతో సోమవారం జరగాల్సిన పరీక్ష మంగళవారానికి వాయిదా పడింది. పిటిషనర్ల వాదన వాస్తవమని తేలితే పిటిషనర్లు బస చేసేందుకు ఖర్చులు చెల్లించేలా ఉత్తర్వులు ఇస్తామని ప్రభుత్వానికి హైకోర్టు చెప్పింది.

వెన్నువిరిగిన అన్నదాత!

'మిచౌంగ్' ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురు గాలులు
తడిచిన ధాన్యం, వరి పనలు, నేలకొరిగిన చేలు

ప్రజాశక్తి- యంత్రాంగం

మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని మండలాల్లో కుండపోత వర్షం పడింది. తుపాను గాలులు తీవ్రంగా వీస్తున్నాయి. తిరుపతి, నెల్లూరు, బాపట్ల, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉంది. ఈదురు గాలులు, వర్షాలకు వరి చేలు నేలకొరగడం, ఆరబెట్టిన ధాన్యం తడిచిపోవడంతో అన్నదాత వెన్ను విరిగింది. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో అంధకారం నెలకొంది. వాగులు వంకలు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

బాపట్ల జిల్లాలో కోత కోసి పొలాల్లో ఆరబెట్టిన వరి పనలు తడిచిపోయాయి. కోతకు వచ్చిన వరి చేలు ఈదురు గాలుల వల్ల నేలకొరిగాయి. ఏలూరు జిల్లాలో 1,93,398 ఎకరాల్లో వరి సాగు కాగా, ఇప్పటి వరకూ 89,542 ఎకరాల్లోనే (45 శాతం), పశ్చిమగోదావరి జిల్లాలో 2.15 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, ఇప్పటి వరకూ 30,600 ఎకరాల్లో (35 శాతం) మాత్రమే కోతలు, నూర్పులు పూర్తయ్యాయి. ఈ రెండు జిల్లాల్లో సుమారు 60 శాతం పంట పొలాల్లోనూ, కళ్లాలోనూ ఉంది. నూర్పులు చేసిన ధాన్యాన్ని రోడ్లపైనా, కళ్లాలోనూ ఉంచారు. పశ్చిమగోదావరి జిల్లాలో 31 వేల టన్నుల ధాన్యాన్ని కళ్లాలో ఆరబెట్టారు. వీటిపై కప్పిన తార్పాలిన్లు ఈదురు గాలులకు ఎగిరిపోయి ధాన్యం తడిసి ముద్దవుతోంది. కోత కోయని పొలాల్లోని వరి చేలు ఈదురు గాలులకు



తూర్పుగోదావరి జిల్లా పెరవలిలో ఈదురుగాలులకు నేలకొరిగిన అరటిపంట

నేలకొరిగాయి. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో కళ్లాల్లో 1.70 లక్షల క్వింటాళ్ల ధాన్యం ఉంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ ధాన్యాన్ని కళ్లాల వద్దే ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసి మిల్లులకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈదురుగాలులకు తూర్పుగోదావరి జిల్లా పెరవలి, చాగల్లు, కొవ్వూరు రూరల్, కోనసీమ జిల్లాలో ఐ.పోలవరం, రాజోలు, మలికిపురం, కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు, తొండంగి మండలాల్లో వరి చేలు నేలకొరిగాయి. పెరవలిలో అరటి చెట్లు విరిగిపోయాయి.

తిరుపతి జిల్లాలో కుండపోత వర్షం ఆగకుండా పడుతుండడంతో వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. పలుచోట్ల వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. తిరుమల ఘాట్‌లో పొగమంచు వాహనదారులకు ఇబ్బందిగా మారడంతో ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకే వాహనాలను అనుమతిస్తున్నట్లు టిటిడి ప్రకటించింది. బాలాయపల్లి మండలం పిగిలాం గ్రామంలో రామకృష్ణయ్యనాయుడుకు చెందిన షెడ్డు కూలడంతో ఆయనకు చెందిన నాలుగు దూడలు మృతి చెందాయి.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో డెల్టా ప్రాంతాల్లో పనలపై ఉన్న వరికి తీవ్ర నష్టం వాట్లింది. తెనాలి, పొన్నూరు, మంగళగిరి నియోజకవర్గాలోని పలు గ్రామాల్లో వరి పైరు నేలవాలింది. పత్తి పంటకూ నష్టం వాటిల్లింది. జోరు వాన వల్ల పూత, కాయ దెబ్బతింది. తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి నేలరాలిపోతోంది. మిర్చి పైరుకు ప్రస్తుతం వర్షం ఊపిరిపోసింది.

కృష్ణా జిల్లా చల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని పొలాల్లో నీరు చేరడంతో వరి పనలు నీటిలో తేలియాడుతున్నాయి. గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు గ్రామంలో సుమారు 300 ఎకరాల్లో కోసి రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయింది. అనకాపల్లి జిల్లాలోని పలు మండలాల్లో మరో పది రోజుల్లో కోయాల్సిన పంట చేలు నేలకొరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలు చోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల చిరుజల్లులు పడ్డాయి.

నెల్లూరు జలదిగ్బంధనం

నెల్లూరు నగరం జలదిగ్బంధనంలో చిక్కుకుంది. రాకపోకలు స్తంభించాయి. ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉంది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించింది. జిల్లాలో 38 మండలాలు ఉండగా, వీటిలో పది మండలాల్లో తుపాన్ తీవ్ర ప్రభావం చూపుతోంది. సోమవారం ఒక్క రోజే జిల్లాలో 65.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. నెల్లూరులో 245 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇందుకూరుపేటలో 200 మిల్లీమీటర్లు, విడవలూరులో 184, వెంకటాచలంలో 181, కోవూరులో 176, టి.గూడూరులో 162, ముత్తుకూరులో 156, మనుబోలులో 150, కొడవలూరు 132, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నెల్లూరులోని గాంధీ గిరిజన కాలనీలో సిపిఎం నాయకులు పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

పునరావాస కేంద్రంలో ఆకలి కేకలు

చేపల వేటపై జీవించే తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం అంబలపూడిలోని గిరిజనులను గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పునరావాసంలో ఉంచారు. ఆదివారం రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయకపోవడంతో వస్తు ఉండాల్సి వచ్చింది. సరైన సౌకర్యాలు లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు చలికి గజగజ వణుకుతున్నారు.

ఎగిసి పడుతున్న అలలు

అలల ఉధృతికి ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలంలో పల్లెపాలెం వద్ద సముద్రం కోతకు గురైంది. విశాఖ నగరంలోనూ, కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలోనూ సముద్రపు అలలు పెద్ద ఎత్తున ఎగసిపడుతున్నాయి. తిరుపతి జిల్లా వాకాడు సమీపంలోని తూపిలిపాలెం వద్ద సముద్రం 30 మీటర్ల ముందుకు వచ్చింది.

పలు విమానాలు రద్దు

విశాఖ ఎయిర్ పోర్టు నుంచి పలు విమానాలను రద్దు చేస్తూ ఎయిర్ పోర్టు డైరెక్టర్ సోమవారం నిర్ణయం తీసుకున్నారు. విజయవాడ-విశాఖపట్నం, విశాఖపట్నం -తిరుపతి, తిరుపతి -విజయవాడ, విశాఖపట్నం -విజయవాడ, విశాఖ-చెన్నయ్, హైదరాబాద్ -విశాఖపట్నం ఫ్లైట్స్ అన్నీ పూర్తిగా రద్దయ్యాయి. మంగళవారం వరకూ ఇదే పరిస్థితి కొనసాగనుంది. రేణిగుంట విమానాశ్రయంలో 15 విమాన సర్వీసులను రద్దు చేశారు.

తెలంగాణలో...

తెలంగాణ రాష్ట్రంలోని ఆకాశం మేఘావృతమై ఉంది. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా జల్లులు పడ్డాయి.

జగన్‌కు భయం పట్టుకుంది

- టిడిపి ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పక్క రాష్ట్రం తెలంగాణలో జరిగిన రాజకీయ పరిణామాలు చూసి భయం పట్టుకుందని టిడిపి ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎపితో పోలిస్తే తెలంగాణలో జరిగిన అవినీతి తక్కువే అని, అయినా అక్కడి ప్రజలు ప్రభుత్వాన్ని ఓడించారని తెలిపారు. రాష్ట్రంలో తన పరిస్థితి, ప్రభుత్వ పరిస్థితి ఏమిటనే భయం జగన్‌కు పట్టుకుందన్నారు. గతంలో ఉభయ రాష్ట్రాల మధ్య నీటి వివాదం తలెత్తినప్పుడు గవర్నరును చంద్రబాబు సంప్రదించి సమస్యలు పరిష్కారమయ్యేలా చూశారని తెలిపారు. పోలీస్ వ్యవస్థలోని కొందరు అధికారులు పనితీరు మార్చుకోకపోతే తెలంగాణ డిజిపికి పట్టిన గతి వరకు తెచ్చుకోవద్దని సూచించారు.

టిడిపి గుడివాడ ఇన్‌చార్జ్‌గా రాము

టిడిపి గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వెనిగండ్ల రామును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు నియమించారు. అరకు పార్లమెంట్ అధ్యక్షులుగా కిడారి శ్రావణ్ కుమార్‌ను, అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సియ్యారి దొన్నుదొరను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

తుపాను బాధిత రైతులను ఆదుకోవాలి

- కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు
- పంటలను పరిశీలించిన నేతలు

ప్రజాశక్తి - కంకిపాడు / అమరావతి బ్యూరో

పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. తుపాను నేపథ్యంలో కృష్ణాజిల్లా కంకిపాడు మండలంలోని గొడవర్రు, కాసరనేని వారిపాలెం, మద్దూరు, పునాదిపాడు, కంకిపాడు క్రిష్టియన్‌పేట, జగన్నాథ పురం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను, ధాన్యం కల్లాలను సోమవారం హరిబాబుతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.శివనాగేంద్రం తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. చాలాచోట్ల ధాన్యం కళ్లాలోనే ఉందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందువల్ల షరతులు లేకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యాన్ని ప్రభుత్వమే మిల్లులకు చేరవేసి రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ.. సకాలంలో గోని సంచులు అందించకపోవడం,



కంకిపాడు మండలంలో పంటలను పరిశీలిస్తున్న ఎం.హరిబాబు, వై.నరసింహారావు, కె.శివనాగేంద్రం తదితరులు

వాహనాలు పంపకపోవడంతో ధాన్యం నీట మునిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలన్నారు. సిపిఎం కంకిపాడు మండల కార్యదర్శి టి.నరేష్, కౌలు రైతు సంఘం కంకిపాడు మండల అధ్యక్షులు జె.రవి, నాయకులు వి.జాన్ మోజేష్, ఏసు పాల్గొన్నారు.

నూర్చిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

రైతులు నూర్చిన ధాన్యాన్ని మిల్లులకు చేర్పించేలా అధికారులు చొరవ చూపాలని ఎపి కౌలు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను తీవ్రతను రైతులకు తెలియజెప్పి పంట నూర్పిడిని అధికారులు ఆపలేకపోయారన్నారు. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల తదితర జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరికోతలు కోసి, నూర్చి ధాన్యాన్ని రైతులు సిద్ధం చేశారని తెలిపారు. మిల్లులకు తరలించాలని ప్రయత్నించినా సంచులు, కాటా, రవాణా వంటి సమస్యలతో చేయలేకపోయారని తెలిపారు. గతంలో సబ్సిడీకి ఇచ్చిన పట్టాలు, టార్పాలిన్లు ప్రభుత్వం తీసేసిందని, దీంతో రైతులు ధాన్యం కాపాడుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా జగన్నాథపురంలో గత నెల 27న ధాన్యం కాటా వేసినా.. ఇప్పటికీ మిల్లులకు తరలించలేదని తెలిపారు. మరికొన్ని గ్రామాల్లో సంచులు అందుబాటులో లేక రోడ్లు, కళ్లాల్లో నిలువ చేస్తున్నారని పేర్కొన్నారు. గుడివాడలో దాదాపు 30కు పైగా లారీల్లో వచ్చిన ధాన్యాన్ని మిల్లు కెపాసిటీ మించిందని దిగుమతి చేసుకోకపోవడంతో రోడ్లపై నిలిపివేశారని తెలిపారు. సివిల్ సప్లయి అధికారులతో కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టరు మాట్లాడినా.. సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని మిల్లులకు గానీ, ప్రభుత్వ, ప్రైవేటు గోడౌన్లకు గానీ తరలించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై అధికారులు జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు.

12 జిఎస్‌టి కౌన్సిల్ కేంద్రాలు

- నాలెడ్జ్ హబ్‌గా 'జ్ఞాన నేత్రం'
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వాణిజ్య పన్నులశాఖలో పాత విధానాలకు స్వస్తి పలికి సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 12 జిఎస్‌టి కౌన్సిల్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. విజయవాడలోని తుమ్మళపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 'జ్ఞాననేత్రం కమర్షియల్ ట్యాక్స్ విజన్, మిషన్ వ్యాల్యూస్, జిఎస్‌టి మిత్ర' లోగోను మంత్రి ఆవిష్కరించారు. నిజాయతీగా పన్నుకట్టే వినియోగదారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గతేడాదితో పోల్చితే వృద్ధి రేటు ఆంధ్రప్రదేశ్ 31 శాతం, తమిళనాడు 20, కేరళ 20, తెలంగాణ 18, కర్ణాటక 17, ఒడిశా 3 శాతాలుగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది నవంబరు వరకు రూ.21,180.57 కోట్ల జిఎస్‌టి రెవెన్యూ వసూళ్లు చేసి 90 శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్లు బుగ్గన వెల్లడించారు. సిఎం ప్రధాన సలహాదారు అజయ్‌కల్లం, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, జిఎస్‌టి ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ధీరజ్ రస్తోగి తదితరులు మాట్లాడారు.

యువగళం పాదయాత్రకు తాత్కాలిక బ్రేక్

- తుపాను కారణంగా మూడు రోజుల విరామం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

తీవ్ర తుపాను కారణంగా యువగళం పాదయాత్రకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మూడు రోజులు విరామం ప్రకటించారు. ప్రస్తుతం పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండల పొన్నాడ శీలంవారిపాకల వద్ద యువగళం పాదయాత్ర నిలిచింది. ఆదివారం సాయంత్రం వరకూ కొనసాగిన యాత్ర సోమవారం నుంచి నిలుపుదల చేశారు. తుపాను కారణంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతోపాటు, ఈదురుగాలులు వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో తుపాను ప్రభావం తగ్గిన తరువాత ఈ నెల ఏడున శీలంవారిపాకల నుంచి యువగళం యాత్ర ప్రారంభమవుతుందని లోకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి మిచౌంగ్ తుపాన్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రావొద్దని సూచించారు. సహాయక చర్యల్లో టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నవంబర్ 28కి ముందున్న పరిస్థితిని పునరుద్ధరించండి

- కెఆర్ఎంబికి తెలంగాణ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద నవంబర్ 28వ తేదీకి ముందున్న పరిస్థితిని పునరుద్ధరించాలని తెలంగాణ ప్రభుత్వం మరోమారు కోరింది. ఈ మేరకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) చైర్మన్‌కు తెలంగాణ నీటిపారుదల శాఖ ఇఎన్‌సి మురళీధర్ సోమవారం లేఖ రాశారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు సాగర్‌ను తెలంగాణనే నియంత్రించాలని ఇఎన్‌సి పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా నవంబర్ 28వ తేదీకి ముందున్న పరిస్థితిని పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణా బోర్డుకు విజ్ఞప్తి చేశారు. డ్యాం వద్ద సిఆర్‌పిఎఫ్ బలగాల మోహరింపునకు తెలంగాణ ప్రభుత్వం సహకరించినట్లు తెలిపారు. ఎపి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా తక్షణమే స్పందించాలని కెఆర్ఎంబిని కోరారు.

ఉద్యోగ భద్రత ఏదీ?

- కదం తొక్కిన సమగ్ర శిక్షా ఉద్యోగులు
- కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు


విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సర్వశిక్షా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ప్రజాశక్తి - యంత్రాంగం

తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, తక్షణమే గ్రాస్ పే అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నాకు దిగారు. విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళనలో ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు పాల్గొన్నారు. సమగ్ర శిక్షా పరిధిలో మండల విద్యాశాఖా కార్యాలయాల్లో పనిచేస్తున్న సిఆర్ఎంటిలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, మండల లెవెల్ అకౌంటెంట్లు, మెసెంజర్లు, సహిత విద్యా రిసోర్స్ పర్సన్లు, భవిత, ఫిజియో థెరపిస్టులు, పాఠశాలల్లో పనిచేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటి పార్ట్ టైం టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, అందరికీ మినియం ఆఫ్ టైం స్కేల్ అమలు చేసి, వేతనాలు పెంచాలని కోరారు.

విశాఖ పరిధిలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద, అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద, అల్లూరి జిల్లాలో పాడేరు ఐటిడిఎ ఎదుట ఆవేదన దీక్ష నిర్వహించారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షనుద్దేశించి ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు పి.మణి మాట్లాడారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టులోకి మార్చి మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలు చేసి వేతనాల పెంచాలని, ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేసి వేతనాలు పెంచాలని, రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ గ్రాడ్యూటీ కల్పించాలని డిమాండ్ చేశారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి సమగ్ర శిక్షా ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వాసా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, వేతనంలో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ ఎదుట దీక్ష నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వశిక్షా అభియాన్ ఉద్యోగ సంఘాల నాయకులు పోలినాయుడు, ఈశ్వరరావు, దివాకర్, లక్ష్మణరావు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ తదితరులు మాట్లాడారు. విద్యాశాఖలో విశిష్ట సేవలు అందిస్తున్న సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


వినియోగదారుల బిల్లులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు సిహెచ్.బాబూరావు, బి.రమణరావు, కె.దుర్గారావు, సిహెచ్.శ్రీనివాస్ తదితరులు

విద్యుత్ ఛార్జీలు పెంచలేదనడం మోసపూరితం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ

ప్రతి నెలా సర్దుబాటు భారం మోపుతూ విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదని ప్రభుత్వం ప్రకటించడం మోసపూరితమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. గత నాలుగేళ్లలో సర్దుబాటు ఛార్జీల పేరుతో వేలాది కోట్ల రూపాయల భారం ప్రజలపై మోపుతోందని వివరించారు. ప్రభుత్వ చర్యలతో ప్రతి నెలా విద్యుత్ భారాలు పెరుగుతున్నాయన్నారు. కార్పొరేట్ల దోపిడీ, పాలకుల అవినీతి ఫలితంగానే ఈ భారాలు పడుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సంస్థల ఆదాయ, వ్యయ నివేదికలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ 61వ డివిజన్ పాయకాపురంలోని శాంతినగర్‌లో సోమవారం బాబూరావు పర్యటించి వినియోగదారుల విద్యుత్ బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024- 25లో విద్యుత్ ఛార్జీలను పెంచడం లేదని, ప్రజలకు ఊరట కలిగిస్తున్నామని విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులు ప్రకటించడం మోసపూరితమన్నారు. గత నాలుగేళ్లుగా వైసిపి ప్రభుత్వం దొడ్డిదారిన, ప్రజల కళ్లు కప్పి, వినియోగదారులపై వేలాది కోట్ల రూపాయల భారం మోపిందని తెలిపారు. ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు చార్జీలు...ఇలా పలు రూపాల్లో విద్యుత్ బాదుడు కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం ప్రతి వినియోగదారుడి నుంచి ప్రతి యూనిట్ పైన ప్రతి నెలా అదనంగా రూ.1.50 భారం మోపుతోందని తెలిపారు. అదనంగా మరో రూ.7200 కోట్ల సర్దుబాటు ఛార్జీలు వసూలు చేసే ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, నాయకులు కె.దుర్గారావు, సిహెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మిచౌంగ్‌తో తమిళనాడు అతలాకుతలం


సముద్రాన్ని తలపిస్తోన్న చెన్నై విమానాశ్రయం

విశాఖపట్నం/ చెన్నై: మిచౌంగ్ తుఫాను ప్రభావం వల్ల ఆదివారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తమిళనాడు అతలాకుతలమవుతోంది. సోమవారం తెల్లవారుజాము నుండి చెన్నైలో కుండపోతగా వర్షాలు కురియడంతో నగరంలోని 14 రైల్వే సబ్‌వేల్లోకి వర్షపు నీరు చేరింది.. చెన్నైలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తాంబరం ప్రాంతంలో నీటిలో చిక్కుకొన్న 15మందిని ఎన్డీఆర్ఎఫ్ బందాలు రక్షించాయి. ముమ్మర వర్షాలతో బాసిన్ బ్రిడ్జ్, వ్యాసర్‌పాడి మధ్యలోని 14వ నెంబరు బ్రిడ్జిని అధికారులు మూసివేశారు. పరిస్థితి బీభత్సంగా వుండడంతో మంగళవారం పబ్లిక్ హాలిడే ప్రకటించారు. తుపాను దెబ్బకు ఇప్పటికే పలు రైళ్లు రద్దయ్యాయి. భారీ వర్షాలకు చెన్నైలోని కనతూరు ప్రాంతంలో ఓ గోడ కూలిపోయి ఇద్దరు కూలిలు మతి చెందారు.

చెన్నైలో సముద్రాన్ని తలపిస్తున్న ఎయిర్‌పోర్ట్

చెన్నైలో పలుచోట్ల రోడ్లు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. కార్లు కొట్టుకుపోయాయి. చెన్నై విమానాశ్రయం సముద్రాన్ని తలపిస్తోంది. రన్‌వేపైకి వరదనీరు చేరింది. దీంతో ఇప్పటికే 16 విమాన సర్వీసులను నిలిపివేశారు. తుఫాను బీభత్సంతో విమానాల రాకపోకలను నిలిపివేసామని, మరికొన్ని విమానాలను దారి మళ్లించామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం చెన్నైలో బీభత్సం సష్టిస్తున్న వర్షాలకు సంబంధించిన దశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. భారీ వర్షాలతో చెన్నై ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై, కట్టుదిట్టమైన భద్రతా చర్యలను చేపట్టింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

కులవివక్ష చూపుతున్న వారిపై చర్యలు తీసుకోండి

- ఎస్‌సి కమిషన్ ఛైర్మన్‌కు కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితుల పట్ల కులవివక్ష చూపుతున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లప్ప, అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతపురం జిల్లా కనేకల్ మండలం బెణకల్ గ్రామంలో దళితుల పట్ల కులవివక్ష, అంటరానితనాన్ని పాటిస్తూ దళితులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆధిపత్య అగ్రకులహంకారుల దుర్మార్గమైన చర్యలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం శానంపూడి గ్రామంలో తిరుణాళ్లకు డబ్బులు ఇవ్వలేదని దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన గ్రామాన్ని సందర్శించి న్యాయం చేయాలని కోరారు. నవంబరు 27, 28, 29 తేదీల్లో గౌరీమాత పండగ సందర్భంగా జరిగిన ఎద్దుల పోటీల్లో దళితుల పట్ల కులవివక్ష చూపుతూ గౌరీమాత ఆలయంలోకి అనుమతించకుండా అవమాన పరిచిన అగ్రవర్ణ పెత్తందార్లపై చర్య తీసుకోవాలన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- పిసిసి వర్కింగ్ ప్రెసిడెంటు జంగా గౌతమ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన విజయస్ఫూర్తితో ఎపిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంటు జంగా గౌతమ్ అన్నారు. ఆంధ్రరత్న భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, అభివృద్ధిని కోరుకునే ప్రజలు, నాయకులు కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని కోరారు. ఈ నెల 13న విజయవాడలో పిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఎన్నికల రోడ్ మ్యాప్‌ను రూపొందించి ఎన్నికల్లో ముందంజ వేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

శ్రీనివాస్ మృతి తీరని లోటు : గిడుగు

పిసిసి ప్రధాన కార్యదర్శి, గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన జక్కా శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. పొన్నూరులోని శ్రీనివాస్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కూలిన ట్రైనీ హెలికాప్టర్

- ఇద్దరు పైలెట్లు సజీవ దహనం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శిక్షణలో ఉన్న హెలికాప్టర్ సాంకేతిక లోపంతో కూలిపోవడంతో ఇద్దరు పైలెట్లు సజీవ దహనమైన సంఘటన తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాల్టీ పరిధిలోని రావెల్లి గ్రామ శివారులో సోమవారం జరిగింది. ఎయిర్‌ఫోర్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ నుంచి శిక్షణ నిమిత్తం బయలుదేరిన హెలిక్యాప్టర్‌లో రావెల్లి గ్రామ శివారులో సాంకేతిక లోపం ఏర్పడింది. టాటా కాఫీ పరిశ్రమ సమీపంలోని రాళ్ల గుట్టల్లో ఇది కూలిపోయింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో హెలికాప్టర్ పూర్తిగా కాలి బూడిదైంది. ఇద్దరు పైలెట్లు అక్కడికక్కడే మృతిచెందారు. వారు వియత్నాంకు చెందిన అభిమన్యూరాయ్, ఇతర దేశానికి చెందిన ఉవాన్‌టైమ్‌గా గుర్తించారు. ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఫైర్ ఇంజన్ల ద్వారా అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనా స్థలాన్ని ఎయిర్‌ఫోర్స్ అధికారులు అధీనంలోకి తీసుకుని ప్రమాద వివరాలను సేకరించారు.

పెరుగుతున్న జిఎస్‌టి వసూళ్లు

- నెలకు సగటున రూ.1.66 లక్ష కోట్లకు చేరిక
- మంత్రి సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళు నెలకు రూ.1.66 లక్షల కోట్లకు చేరాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సోమవారం పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభమైన సందర్భంగా లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2017 జులైలో జిఎస్‌టి ప్రవేశపెట్టినప్పటి నుంచి ప్రతీ ఏడాది పన్ను వసూళ్లు పెరుగుతూనే వస్తున్నాయన్నారు. గడిచిన ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ప్రతీ నెల రూ.1.50 లక్షల కోట్ల పైనా వసూళ్లు జరుగుతున్నాయన్నారు. గతేడాదితో పోల్చితే 11 శాతం వృద్ధి చోటు చేసుకుంటుందన్నారు. 2022-23లో ప్రతీ నెల సగటున రూ.1.50 లక్షల కోట్లు, 2021-22లో రూ.1.23 లక్షల కోట్లు, 2020-21లో రూ.94,734 కోట్ల చొప్పున ప్రతీ నెల వసూళ్లు జరిగాయన్నారు.

కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మరో ప్రశ్నకు సమాధానంగా చెబుతూ 2021-22లో 30 శాతం, 2022-23లో 22 శాతం స్థూల జిఎస్‌టి వసూళ్లు పెరిగాయన్నారు. వ్యాపారులు స్వయం మదింపు ప్రకారం జిఎస్‌టి చెల్లిస్తున్నారని అన్నారు. ఒకవేళ పన్నులు చెల్లించకున్నా.. తక్కువ చెల్లించినా సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకునే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఉందన్నారు. ప్రస్తుత ఏడాది నవంబర్‌లో దేశంలో రూ.1,67,929 కోట్ల వస్తు సేవల పన్నులు (జిఎస్‌టి) వసూళ్లయ్యాయి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 15 శాతం పెరిగాయి. 2023-24లో జిఎస్‌టి వసూళ్లు రూ.1.60 లక్షల కోట్ల మార్కును దాటడం ఇది ఆరోసారి కావడం విశేషం. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల వసూళ్లు నమోదయ్యాయి.

ఉన్నత విద్య నుంచి 13వేల మంది అణగారిన విద్యార్థులు అవుట్!

న్యూఢిల్లీ: దేశంలో కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల నుంచి గడచిన అయిదేళ్లలో 13వేల మంది ఎస్సీ, ఎస్టీ,ఓబిసి విద్యార్థులు చదువుకు మధ్యలో ఆపేసి బయటకొచ్చేశారు. లోక్‌సభలో బిఎస్పీ సభ్యుడు రూపేశ్ పాండే అడిగిన ప్రశ్నకు విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ సమాధానమిస్తూ ఈ సంగతి వెల్లడించారు. ప్రతిష్టాత్మక విద్యా సంస్థలుగా భావించే ఐఐటి, ఐఐఎం, సెంట్రల్ యూనివర్సిటీల నుంచి అందిన డేటా ప్రకారం 4,596 మంది ఓబిసి విద్యార్థులు, 2,424 మంది ఎస్సీ, 2622 మంది ఎస్టీ విద్యార్థులు సెంట్రల్ యూనివర్సిటీల నుంచి ఈ అయిదేళ్లలో డ్రాపవుటయ్యారు. ఐఐటి,ల నుంచి 2,066 మంది ఓబిసి విద్యార్థులు, 1,068 మంది ఎస్సీ విద్యార్థులు, 408 మంది ఎస్టీ విద్యార్థులు తమ కోర్సు పూర్తి చేయకుండానే వెళ్లిపోయారు. ఐఐఎంలలో 163 మంది ఓబిసి విద్యార్థులు, 188 మంది ఎస్సీలు, 91 మంది ఎస్టీ విద్యార్థులు డ్రాపవుట్ అయ్యారు. జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో డ్రాపవుట్స్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం తన వద్ద లేదని మంత్రి తెలిపారు. ఈ డ్రాపవుట్లకు కారణం విద్యార్థుల పేదరికమేనని మంత్రి తేల్చేశారు.

సచివాలయ ఉద్యోగినిపై వైసిపి నేత లైంగిక దాడి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ జిల్లా ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో ఉన్న సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగినిపై వైసిపి మండల నాయకుడు సోమవారం లైంగిక దాడికి పాల్పడ్డాడు. తన తల్లితో కలిసి బాధితురాలు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం బయటపడింది. నిందితుడు రాజేష్‌ను కఠినంగా శిక్షించాలని బాధితురాలి తల్లి డిమాండ్ చేస్తున్నారు. మా బావ ఎమ్మెల్యే అంటూ నిందితుడు బెదిరింపులకు పాల్పడుతున్నారని, నిందితుడి నుంచి తన కుమార్తెకు ప్రాణహాని ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఉమ్మడి ఆస్తుల విభజన జాప్యంపై విచారణ మార్చికి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తుల విభజనలో జాప్యంపై దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వచ్చే ఏడాది మార్చికి వాయిదా వేసింది. ఆస్తుల విభజన వ్యవహారంలో జాప్యంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఇప్పటికే ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. కాగా మరోసారి ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టితో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేంద్రం తరపున హాజరైన న్యాయవాదులు ఈ సందర్భంగా పలు అంశాలను ప్రస్తావించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం... వివిధ అంశాల రీత్యా ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను మార్చికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది.

సంపాదకీయం


మితవాద ముప్పు

మరి కొన్ని నెలల్లో జరిగే దేశ సార్వత్రిక ఎన్నికలకు రిహార్సల్‌గా పేర్కొంటున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పెరుగుతున్న మతతత్వ ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. చిన్న ఈశాన్య రాష్ట్రం మిజోరంను పక్కన పెడితే తతిమ్మా నాలుగు పెద్ద రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి గెలిచింది. గత ఎన్నికల్లో ఈ మూడింటిలోనూ కాంగ్రెస్‌కు మెజార్టీ సీట్లు రాగా, బిజెపి కుట్రలు, హస్తం పార్టీలో కుమ్ములాటల వలన ఏడాదిలోనే మధ్యప్రదేశ్‌ను ఆ పార్టీ చేజార్చుకుంది. ఐదేళ్ల తర్వాత ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లను బిజెపి కైవసం చేసుకోవడమే కాకుండా మధ్యప్రదేశ్‌లో తిరిగి అధికారాన్ని నిలబెట్టుకుంది. హిందీ మాట్లాడే మూడు రాష్ట్రాల్లో మతతత్వంతో సహా సామ దాన భేద దండోపాయాలన్నింటినీ బిజెపి ఉపయోగించి గెలిచింది. రాష్ట్రాల్లోని స్థానిక నేతలను పక్కకు నెట్టి అన్నింటా బిజెపి కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకోవడంతో పార్టీలో కేంద్రీకరణ పెరిగింది. ఆ రాష్ట్రాల్లో ప్రధాన పోరు బిజెపి, కాంగ్రెస్ మధ్యనే నడిచింది. కాగా తెలంగాణలో అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ అనూహ్య విజయం సాధించింది. ఇదొక్కటే కాంగ్రెస్‌కు ఊరట. తెలంగాణలో అధికారంలోకొస్తామని గొప్పలు చెప్పుకోవడంతో పాటు ప్రధాని మోడీ, అమిత్ షా, నడ్డా, పలువురు బిజెపి ముఖ్యమంత్రులు తెలంగాణ వ్యాప్తంగా కాలికి బలపం కట్టుకొని తిరిగినా ప్రజలు బిజెపిని మూడో స్థానంలోకి నెట్టడం లౌకిక శక్తులకు ఆనందాన్నిచ్చే విషయం. తెలంగాణలో భంగపాటుతో బిజెపి దక్షిణాది ఆశలు అడియాసలయ్యాయి. అయినప్పటికీ ఆ పార్టీకి ఎనిమిది సీట్లు, 13 శాతం ఓట్లు రావడం మతతత్వ ప్రమాదానికి సూచిక.

కాంగ్రెస్ ఒంటెత్తు పోకడలే మూడు హిందీ రాష్ట్రాల్లో ఆ పార్టీ ఓటమికి ప్రధాన హేతువు. బిజెపిని ఓడించే లక్ష్యంతో జాతీయ స్థాయిలో 'ఇండియా' వేదిక ఏర్పడగా, ఆ ఫోరంలోని పార్టీలను ఎన్నికల్లో కలుపుకొనిపోయే కీలకాంశాన్ని కాంగ్రెస్ తేలిగ్గా తీసుకుంది. రాజస్థాన్‌లో అత్యధిక స్థానాలు గెలిచిన బిజెపికి, కాంగ్రెస్‌కు మధ్య ఓట్ల తేడా రెండు శాతం లోపే. అక్కడ బిజెపికి వ్యతిరేకంగా పని చేస్తున్న లౌకిక పార్టీలను, కనీసం 'ఇండియా' లోని పార్టీలను లెక్కలోకి తీసుకోకపోవడం ఆ పార్టీ అహంభావానికి నిదర్శనం. సంస్థాగత ఇబ్బందులతోపాటు లౌకిక పార్టీలను పట్టించుకోని ఫలితమే రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఓటమి. మధ్యప్రదేశ్‌లో ఎస్‌పి వంటి పార్టీలను దగ్గరకు రానీయలేదు. ఛత్తీస్‌గఢ్ లోనూ ఇదే పరిస్థితి. అవినీతి, కులాల కుంపట్లు అక్కడ కాంగ్రెస్‌ను దెబ్బతీశాయి. గెలిచిన బిజెపికి కాంగ్రెస్‌కు మధ్య ఓట్ల తేడా మూడు శాతం లోపే. తెలంగాణలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్‌పై జనంలో గూడు కట్టుకున్న ప్రజా వ్యతిరేకత, అవినీతి, కుటుంబ పాలన, పక్కనున్న కర్ణాటకలో గెలిచిన జోష్, కాంగ్రెస్‌ను విజయ తీరాలకు చేర్చాయి. తెలంగాణలో కూడా 'ఇండియా' లోని పార్టీలను కలుపుకుపోలేదు. రాజస్థాన్‌లో బిజెపి, కాంగ్రెస్ హంగు ఆర్భాటాల నడుమ పోరాడిన సిపిఎంకు పలు చోట్ల పెద్ద సంఖ్యలో ఓట్లు రావడం విశేషం. ఆ పార్టీ పట్ల ప్రజాదరణకు నిదర్శనం.

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలన్న లక్ష్య సాధనకు పని చేస్తున్న పార్టీలు రెట్టించిన పోరాటం సల్పాలన్న వాస్తవాన్ని ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు నొక్కివక్కాణిస్తున్నాయి. ఆ దృష్టితో చూస్తే 'ఇండియా' ఫోరం మరింత బలోపేతం కావాల్సిన ఆవశ్యకత ఉంది. రాజ్యాంగాన్ని, లౌకిక, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న బిజెపి మితవాదానికి వ్యతిరేకంగా పోరాడే పార్టీలు, శక్తులన్నీ మరింత ఐక్యతతో ఒక తాటిపైకి రావాల్సి ఉంది. సామాజిక న్యాయం, సంక్షేమ పథకాలతోనే బిజెపిని ఓడించాలనుకుంటే సరిపోదని కాంగ్రెస్ గుర్తించాలి. మతతత్వానికి వ్యతిరేకంగా నికరంగా నిలబడే సైద్ధాంతిక నిబద్ధతపై స్పష్టంగా నిలబడాలి. మృదు హిందుత్వ వంటి అవకాశవాదం ఏమాత్రం పనికిరాదని గ్రహించాలి. బిజెపి ప్రతి రాష్ట్రంలోనూ 50 శాతం ఓట్ల సాధన లక్ష్యాన్ని ఎంచుకుంది. ఎదుర్కోవాలంటే బిజెపిని వ్యతిరేకించే లౌకిక పార్టీల మధ్య మరింత బలమైన విశాల ఐక్యత కావాలి. ఇదే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు దేశానికి ఇచ్చే గుణపాఠం.

మంచి మాట



దేవుడు మానవ కల్పితం.
స్వర్గ నరకాలు లేనే లేవు.
మతం, గుళ్లు, గోపురాలు అక్కరలేదు.
కావలసింది మానవత్వం.

- లూథర్ బర్‌బాంక్,
ప్రముఖ అమెరికన్ వృక్ష శాస్త్రజ్ఞుడు.

సామ్రాజ్యవాదం - పశ్చిమ దేశాల ఉదారవాదం



ప్రభాత్ పట్నాయక్

గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతి నిర్మూలనకు పశ్చిమ దేశాల ఉదారవాద ప్రభుత్వాలు తోడుదొంగల మాదిరిగా మద్దతునిస్తున్నాయి. దీనికి స్పందిస్తూ ఒక మిత్రుడు "ఇక పశ్చిమ దేశాల ఉదారవాదం ముగిసిపోయిన వ్యవహారమే" అన్నారు. ఇంతకన్నా పొరపాటు అవగాహన ఇంకొకటి ఉండదు. ఇంతవరకూ ఆ ఉదారవాద శక్తులు సామ్రాజ్యవాదుల దురాగతాలను వ్యతిరేకిస్తున్నట్టు, ఇప్పుడు ఆ వైఖరిని మార్చుకుని మద్దతునిస్తున్నట్టు అతను అర్ధం చేసుకున్నట్టుంది. నిజానికి పశ్చిమ దేశాల ఉదారవాద శక్తులు ఇటువంటి మానవ హననాలకు పూనుకున్న ప్రతీ సందర్భంలోనూ సామ్రాజ్యవాదానికి తోడుదొంగల మాదిరిగానే వ్యవహరించాయి. అందుచేత ఇప్పుడు గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణ మారణ కాండకు మద్దతునివ్వడం ఆ శక్తుల స్వభావానికి అనుగుణంగానే, కొనసాగింపుగానే ఉంది తప్ప వాళ్ళ వైఖరిలో ఏదో మార్పు వచ్చినట్టు అనుకోరాదు. ఒక విషయం వాస్తవం. ఈ మారు ఇజ్రాయిల్‌కు ఇస్తున్న మద్దతు మరీ బాహాటంగా ఉంది. బైటకు ఒక మాట, ఆచరణలో ఇంకొకటి అన్నట్లు లేదు. అంతే తప్ప ఆ ఉదారవాద శక్తుల వైఖరి ఎప్పుడూ సామ్రాజ్యవాదానికి అనుకూలంగానే కొనసాగుతోంది.

ఈ వైఖరిలో అక్కడక్కడా కొన్ని సందర్భాలలో కొందరు కాస్త భిన్నంగా వ్యవహరించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వలస పాలన కింద భారతదేశం ఎంత పేద దేశంగా దిగజారిందో వివరిస్తూ విలియం డిగ్బీ అన్న ఉదారవాద రచయిత చాలా ఎక్కువగా రాశాడు. కాని అటువంటి సందర్భాలు బహు కొద్ది మాత్రమే. అసలు ఉదారవాదపు సిద్ధాంత పునాదే సామ్రాజ్యవాదాన్ని సమర్ధించడం మీద రూపొందింది. ఒక్క కీన్షియన్ విధానం అమలు జరిగిన బహు కొద్దికాలం మినహాయిస్తే ఉదారవాదం ఎప్పుడూ పెట్టుబడిదారీ విధానాన్ని స్వయంశక్తితో నిర్మితమైనదిగాను, దానిపైనే ఆధారపడి కొనసాగేది గాను, సమర్ధవంతమైనది గాను, దయాపూరితమైనదిగాను పరిగణిస్తూ వచ్చింది. మరి అటువంటప్పుడు సామ్రాజ్యవాదం ఏ విధంగా వచ్చింది అన్న ప్రశ్నకు అదొక యాదృచ్ఛికంగా జరిగిన పరిణామంగా ఉదారవాదం వివరిస్తుంది. లేదా, బాగా వెనకబడిన దేశాల ప్రజలను సంస్కరించడానికి, ఉద్ధరించడానికి సామ్రాజ్యవాదం అక్కడ ప్రవేశించింది అని చెప్తుంది. అనుకోని ఘటనల వలన మూడవ ప్రపంచ దేశాలలోకి ప్రవేశించినా, అక్కడి పరిస్థితులను చూసి ఆ ప్రజలను సంస్కరించడానికి సామ్రాజ్యవాదం ప్రయత్నించింది అని అంటుంది.

మరి సామ్రాజ్యవాదులు మూడవ ప్రపంచ దేశాల సంపదను కొల్లగొట్టడం, లేదా, అక్కడ ఉండే స్థానిక జాతులను నిర్మూలించడం వంటి చర్యలను ఆ యా వ్యక్తులు అతిగా వ్యవహరించి సాగించిన దురాగతాలుగా చెప్తుంది ఉదారవాదం. బెంగాల్‌లో వారెన్ హేస్టింగ్స్ సాగించిన దురాగతాలపై విచారణ సందర్భంలో అతడికి వ్యతిరేకంగా వాదించిన ఎడ్మండ్ బర్క్ ఆ విధంగానే భావించాడు. ఈ దురాగతాలకు కారణం ఆ వ్యక్తులు తమ రోజువారీ పనిలో కొట్టుకుపోయి ప్రజల్ని సంస్కారవంతులుగా తీర్చిదిద్దాలనే అసలు లక్ష్యాన్ని మరిచిపోవడమేనంటుంది ఉదారవాదం. పెట్టుబడిదారీ విధానం దయాపూరితం అయినప్పుడు దాని కొనసాగింపుగా వచ్చిన సామ్రాజ్యవాదం మాత్రం దయా పూరితం కాకుండా ఎలా ఉంటుంది? ఇదే ఉదారవాదుల వైఖరి. ఈస్ట్ ఇండియా కంపెనీ మన దేశంలో సాగించిన దుర్మార్గాలను తీవ్రంగా విమర్శించిన ఆడమ్ స్మిత్ ది కూడా ఇదే వైఖరి. ప్లాసీ యుద్ధం అనంతరం ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో బెంగాల్‌లో ఏం జరిగిందో దానిని విమర్శిస్తూ అమెరికాలో బ్రిటిష్ ప్రభుత్వమే నేరుగా పాలించిన చోట ఆ పాలన ఇండియాలో జరిగినదానికి భిన్నంగా ఎంత గొప్పగా ఉందో ఆయన వివరించాడు. అమెరికాలో స్థానిక రెడ్ ఇండియన్ జాతులు మొత్తంగా బ్రిటిష్ సైన్యం చేతుల్లో అంతం అయారన్న వాస్తవాన్ని ఆడమ్ స్మిత్ పూర్తిగా విస్మరించాడు. దానికి బదులు యూరప్ నుండి అమెరికాకు వలసలు పోయిన ప్రజానీకానికి అక్కడ ఎటువంటి అవకాశాలు లభించాయో దానిని మాత్రమే అతడు చూశాడు. అందుకు భిన్నంగా ఇండియాలో స్థానిక ప్రజానీకం దోపిడీకి గురైన వైనాన్ని ఆయన చూశాడు. ఈ తేడాకు కారణం అమెరికాలో నేరుగా బ్రిటిష్ చక్రవర్తి పాలన ఉండడం, ఇండియాలో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన ఉండడమేనని భావించాడు. ఇండియాలో కూడా బ్రిటిష్ చక్రవర్తి పాలన ఉంటే ఇక్కడ ప్రజానీకం కూడా బాగుపడగలరని వాదించాడు. కాని 1857 అనంతరం బ్రిటిష్ రాణి ప్రత్యక్ష పాలనలోకే ఇండియా వచ్చింది. ఆ తర్వాత దోపిడీ మరింత పెరిగింది. సామ్రాజ్యవాదం వలసలను తన పెత్తనం కిందకు తెచ్చుకోవడం వెనుక లక్ష్యం ఆ వలసదేశాల ప్రజలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దడమే అని చాలా స్పష్టంగా జేమ్స్ మిల్ తన "బ్రిటిష్ ఇండియా చరిత్ర" గ్రంథంలో రాశాడు. అంటే ఉదారవాదం సామ్రాజ్యవాదాన్ని ఒక దోపిడీ దారుగా ఎప్పుడూ పరిగణించలేదు అని అర్ధం ఔతోంది. యూరప్ ఖండా నికి వెలుపల ఉన్న ప్రజానీకాన్ని 'ఆధునీకరించడం', 'సంస్కరించడం' సామ్రాజ్యవాదుల లక్ష్యం అని ఉదారవాదం భావించింది. కోట్లాదిమంది ప్రజానీకం మన దేశంలో కరువులబారిన పడి మరణించారు. 1943 బెంగాల్ కరువు ఇందుకొక మచ్చుతునక. ఆ చావులకు వేరే ఇతర కారణాలేవీ లేవు. దానికి కారణం వలస పాలకులు అనుసరించిన విధానమే. కాని ఇది ఉదారవాదులకి కనపడలేదు.

రెండవ ప్రపంచ యుద్ధంలో తూర్పు వైపు యుద్ధరంగంలోకి భారతదేశాన్ని కూడా దింపింది బ్రిటిష్ ప్రభుత్వం. ఈ విషయంలో భారతదేశంలోని ఎవరినీ సంప్రదించనేలేదు. ఆ యుద్ధ ఖర్చుల కోసం ఇక్కడ భారీ లోటు బడ్జెట్‌ను అమలు చేసింది. ఆ సందర్భంలో మార్కెట్‌లో పెరిగే డిమాండ్‌కు తగ్గట్టు సరుకుల సరఫరాను పెంచాలనే విషయాన్ని పూర్తిగా విస్మరించింది. కనీసం ప్రజలందరికీ రేషనింగ్ ద్వారా ఆహార ధాన్యాలను అందించే పని కూడా చేయలేదు. దాని ఫలితంగా చాలా తీవ్ర స్థాయిలో ద్రవ్యోల్బణం పెరిగింది. తిండిగింజలతో సహా అన్ని నిత్యావసరాల ధరలూ తారా స్థాయికి చేరాయి. అదే సమయంలో కార్మికవర్గం ఆదాయాలు పెరుగుదల లేకుండా స్థిరంగా ఉండిపోయాయి. అందువలన వినిమయం బాగా పడిపోయింది. 30 లక్షల మంది ఆ సమయంలో తిండి లేక చనిపోయారు. యుద్ధంలో చనిపోయినవారిలాగే వీళ్ళ చావులకు కూడా యుద్ధమే కారణం. మొత్తం రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ వైపు నుండి సంభవించిన యుద్ధ మరణాల కన్నా ఇక్కడ బ్రిటన్ కారణంగా యుద్ధంలోకి లాగబడ్డ భారతదేశంలో సంభవించిన మరణాలు ఆరు రెట్లు! కాని ఆ మరణాలకి యుద్ధమే కారణం అని ఎక్కడా చెప్పరు. ఇక్కడ ఏర్పడిన కరువు గురించి బ్రిటన్‌లో ఎవరూ పట్టించుకోనేలేదు. బహుశా కావాలనే దానిని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించి వుండొచ్చు కూడా.

ఉదారవాదం ఎప్పుడూ సామ్రాజ్యవాదానికి తోడుగానే వ్యవహరించింది. సామ్రాజ్యవాదం లక్ష్యం 'సంస్కరించడం' అంటూ చెప్పడం అందులో భాగమే. పాలస్తీనా ప్రజల్ని బలిపశువులను చేసి ఒక యూదు రాజ్యాన్ని స్థాపించాలన్న ప్రతిపాదనకు ఉదారవాదం పూర్తి మద్దతునిచ్చింది. వేల సంవత్సరాలపాటు యూదులు వేధింపులకు గురయ్యారని, ఫాసిస్టుల చేతుల్లో యూదులు పెద్ద సంఖ్యలో హతులయ్యారని అందుకే వారికి మద్దతునివ్వాలని ఉదారవాదం వాదించింది. అమెరికా ఖండంలో యూరప్ వలసవాదులు అక్కడి మూలవాసులైన రెడ్ ఇండియన్లను చంపివేసినట్టుగానే ఇక్కడ ఇజ్రాయిల్ స్థానిక పాలస్తీనా ప్రజానీకాన్ని నిర్మూలించడానికి పూనుకుంది. అయినా ఉదారవాదం ఇజ్రాయిల్ వైపే సానుభూతి ప్రదర్శిస్తోంది. 1967లో ఇజ్రాయిల్ ఇదేమాదిరిగా పాలస్తీనా భూభాగాలపై దురాక్రమణకు పూనుకున్నప్పుడు ఫ్రాన్స్ అధ్యక్షుడు చార్లెస్ డి గాల్ ఒక్కడే ఇజ్రాయిల్‌ను వేలెత్తి విమర్శించాడు. తక్కిన పశ్చిమ దేశాలేవీ ఆ విధంగా చేయలేదు. అక్కడి ఉదారవాదులు కూడా తమ తమ ప్రభుత్వాలు అనుసరించిన వైఖరినే బలపరిచారు.

> ఉదారవాదం ఎప్పుడూ సామ్రాజ్యవాదానికి తోడుగానే వ్యవహరించింది. సామ్రాజ్యవాదం లక్ష్యం 'సంస్కరించడం' అంటూ చెప్పడం అందులో భాగమే. పాలస్తీనా ప్రజల్ని బలిపశువులను చేసి ఒక యూదు రాజ్యాన్ని స్థాపించాలన్న ప్రతిపాదనకు ఉదారవాదం పూర్తి మద్దతునిచ్చింది. వేల సంవత్సరాలపాటు యూదులు వేధింపులకు గురయ్యారని, ఫాసిస్టుల చేతుల్లో యూదులు పెద్ద సంఖ్యలో హతులయ్యారని అందుకే వారికి మద్దతునివ్వాలని ఉదారవాదం వాదించింది. అమెరికా ఖండంలో యూరప్ వలసవాదులు అక్కడి మూలవాసులైన రెడ్ ఇండియన్లను చంపివేసినట్టుగానే ఇక్కడ ఇజ్రాయిల్ స్థానిక పాలస్తీనా ప్రజానీకాన్ని నిర్మూలించడానికి పూనుకుంది. అయినా ఉదారవాదం ఇజ్రాయిల్ వైపే సానుభూతి ప్రదర్శిస్తోంది.



రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సామ్రాజ్యవాదం బాగా బలహీనపడింది. అందుచేత తమ తమ ప్రజలకు ఆ యా సామ్రాజ్యవాద దేశాలు రాయితీలు ఇవ్వక తప్పలేదు. మొదటి రాయితీ వలస దేశాలకు స్వాతంత్ర్యం ప్రకటించడం. రెండవది: ప్రభుత్వం ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని ప్రజానీకపు కొనుగోలు శక్తిని పెంచడం, అందుకోసం ఉపాధి అవకాశాలను భారీగా కల్పించడం. ఈ రెండవ రాయితీ వెనుక ప్రేరణ కీన్స్ సిద్ధాంతం. కీన్స్ స్వతహాగా ఉదారవాది. ఐతే పెట్టుబడిదారీ వ్యవస్థ అంత దయామయమైనదేమీ కాదని, అందులో పెద్ద ఎత్తున నిరుద్యోగం ఏర్పడుతూనే వుంటుందని ఆయనే చెప్పాడు. అందుచేత పెట్టుబడిదారీ విధానం ఎవరి తోడ్పాటూ లేకుండానే మనుగడ సాగించగలదనే అభిప్రాయం తప్పు అని చెప్పాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో కీన్స్ విధానాల అమలుకు ఉదారవాదులు, సోషల్ డెమోక్రాట్లు మద్దతునిచ్చారు. ఐతే అంతమాత్రం చేతనే ఆ మార్పులు జరిగాయని భావించరాదు. వలస దేశాల్లో స్వాతంత్ర్య పోరాటాలు చెలరేగడం, సామ్రాజ్యవాద దేశాల్లో కార్మికవర్గ ఆందోళనలు పెల్లుబకడం, మరోవైపున సోవియట్ యూనియన్ లోని సోషలిజం సామ్రాజ్యవాదానికి పెను సవాలుగా పరిణమించడం ఆ మార్పులకు దోహదం చేశాయి.

ఈ మార్పులను బలపరిచినందువలన ఉదారవాదానికి కొంత గౌరవం దక్కింది. సామ్రాజ్యవాదానికి తోడుగా వ్యవహరించిన దాని పాత్ర వెనుక పట్టు పట్టినట్టు కనిపించింది. దానికి తోడు వలసల విముక్తి తర్వాత అసలు సామ్రాజ్యవాదం ఇంకెక్కడుంది? అన్నట్టుగా కొందరు భావించడం జరిగింది.

ఐతే, పెట్టుబడిదారీ విధానంలో నిరంతరమూ కొనసాగే పెట్టుబడి కేంద్రీకరణ వలన అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి రూపొందింది. అది బలపడిన తర్వాత యుద్ధానంతరం అమలు చేసిన సంస్కరణలను అన్నింటినీ ఉపసంహరించాలని నిర్దేశించింది. అదే సమయంలో ప్రపంచం మొత్తం మీద అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి తన ఆధిపత్యాన్ని నెలకొల్పగలిగింది. దాంతో సంపన్న పశ్చిమ దేశాలు మూడో ప్రపంచ దేశాలను కొల్లగొట్టే సామ్రాజ్యవాద విధానం మళ్ళీ పుంజుకుంది.

ఈ మార్పుతో పాటే ఉదారవాదం, సోషల్ డెమోక్రసీ కూడా మారాయి. బ్రిటన్‌లో సోషల్ డెమోక్రసీ బదులు టోనీ బ్లెయిర్ విధానాన్ని లేబర్ పార్టీ స్వీకరించింది. ఇరాక్ మీద యుద్ధానికి అందరికన్నా ఎక్కువ బాధ్యత అతగాడిదే. అందుకే మితవాది మార్గరెట్ థాచర్ తన రక్తసంబంధీకుడంటూ బ్లెయిర్‌ను ప్రశంసించారు. అప్పుడే ఉదారవాదం మళ్ళీ సామ్రాజ్యవాదానికి తోడుగా వ్యవహరించడం పున: ప్రారంభించింది. మళ్ళీ పెట్టుబడిదారీ విధానపు స్వయం ప్రకాశ లక్షణం గురించి, దాని దయాగుణం గురించి పొగడ్తలు మొదలుపెట్టింది. అంటే రెండో ప్రపంచ యుద్ధానంతరం కొద్ది కాలం మాత్రమే ఉదారవాదం కాస్త భిన్నంగా ఉన్నట్టు మనకి కనిపించింది. కాని అ వెనువెంటనే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి రూపంలో సామ్రాజ్యవాదం కొత్త వేషాన్ని దాల్చి కొల్లగొట్టడం మొదలెట్టగానే ఆ సామ్రాజ్యవాదాన్ని సమర్ధించే పనిలో పడింది. కేవలం ఆర్థిక దోపిడీ వరకే ఈ సమర్థన పరిమితం కాలేదు. నయా ఉదారవాదపు దురాక్రమణ యుద్ధాలను, దాడులను సైతం అది పూర్తిగా బలపరుస్తోంది.

ఉదారవాదం, సోషల్ డెమోక్రసీ మళ్ళీ కొత్తగా జట్టు కట్టి మితవాద శక్తుల్ని బలపరడంతో అవి సామాన్య ప్రజానీకానికి దూరం అయిపోయాయి. అందుచేత ఫాసిస్టు శక్తులు మళ్ళీ పై చేయి సాధించడానికి అనువైన వాతావరణం ఏర్పడింది. ఇప్పుడు పశ్చిమ యూరప్ లో ఫాసిస్టు శక్తులు తమ ప్రభుత్వాలు ఉక్రెయిన్ యుద్ధాన్ని బలపరచడం తప్పు అని, రష్యా పై ఆంక్షలను తొలగించాలని ఆందోళనలు చేస్తూ సామాన్య ప్రజల సానుభూతి సంపాదించుకుంటున్నాయి. ఐతే ఆ ఫాసిస్టు శక్తులు గనుక అధికారంలోకి వస్తే అక్కడ మాత్రం సామ్రాజ్యవాదపు దూకుడును బలపరచడానికి వెనుకాడడం లేదు. ఇటలీలో ఇటీవల గెలిచిన ఫాసిస్టు మెలనీ ప్రభుత్వం ఇందుకొక ఉదాహరణ. అందుచేత పశ్చిమ దేశాల ఉదారవాదం స్వభావం ఎప్పుడూ సామ్రాజ్యవాదాన్ని బలపరిచేదిగానే ఉంటూవచ్చింది. అందుకే అది ఇజ్రాయిల్ సాగిస్తున్న మానవ హననాన్ని సమర్ధిస్తోంది. అందుకు గతంలో యూదుల మీద జరిగిన ఊచకోతను ఒక సాకుగా ఉపయోగిస్తోంది.

(స్వేచ్ఛానుసరణ)

పోరాటం

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె ఎందుకు?



కె. సుబ్బరావమ్మ

రాష్ట్రంలో ఉన్న లక్ష మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల వేతనాలు, గ్రాట్యూటీ...తదితర సమస్యలను పరిష్కరించాలని, సమగ్ర శిశు సంక్షేమ పథకాన్ని బలోపేతం చేయాలని కోరుతూ ఈ నెల 8వ తేదీ నుండి రాష్ట్రవ్యాపితంగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె బాట పట్టారు. ఈ సమ్మెకు కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, అభ్యుదయవాదులు, సామాజిక సంఘాలు మద్దతునివ్వాలని కోరుతున్నాం.

అనివార్య పరిస్థితిలో సమ్మెలోకి...

నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వానికి వినతులు ఇస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. సమస్యలు పరిష్కరిస్తామన్న మంత్రులు, ఇతర అధికారుల హామీలు నెరవేరలేదు. అధికారులతో జరిగిన చర్చల్లో చిన్నాచితక సమస్యలు కొన్ని పరిష్కారం అయినా ప్రధాన సమస్యలను పట్టించుకోవటం లేదు. అందుకే...రాష్ట్రంలో ఉన్న 55,605 అంగన్‌వాడీ సెంటర్లను డిసెంబర్ 8 నుండి నిరవధికంగా మూసివేయాలని ప్రధాన మూడు యూనియన్లు నిర్ణయించాయి.

కనీస వేతనాలు ఇవ్వాలి

అంగన్‌వాడీలను ప్రభుత్వమే రిక్రూట్ చేస్తుంది. వారి సర్వీసులకు సంబంధించిన విధి విధానాలను రూపొందిస్తుంది. ప్రభుత్వానికి, అంగన్‌వాడీలకు మధ్య యజమాని-కార్మిక సంబంధం ఉందని సుప్రీంకోర్టే చెప్పింది. ఇదే సుప్రీంకోర్టు 2016లో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ చెప్పింది. ఈ విధంగా చూసినప్పుడు అంగన్‌వాడీలకు సమాన పనికి సమాన వేతనం కింద పర్మినెంట్ ఉద్యోగులకు ఇచ్చే కనీస వేతనాలు, డి.ఎ, ఇతర అలవెన్సులు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇది కనీస స్థాయిలో రూ. 26 వేలు దాటుతుంది. మరో పక్క 2021లో తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచింది. మన రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలైనా అమలు చేద్దామన్న ప్రయత్నం కూడా చేయకుండా మొండికేస్తోంది.

పాలకుల విధానాల వలన నిత్యావసర సరుకుల ధరలు అనేక రెట్లు పెరిగాయి. కానీ అంగన్‌వాడీలకు వేతనాలు పెరగలేదు. భారత కార్మిక మహాసభ సిఫార్సు మేరకు ప్రతి కార్మికునికీ కనీస వేతనం రూ.26 వేలతో పాటు సామాజిక భద్రత సౌకర్యాలైన పి.ఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ తదితర సౌకర్యాలు అమలు చేయాలి. ఇందులో ఏ ఒక్కటీ అంగన్‌వాడీలకు అమలు కావడం లేదు.

'సుప్రీం' తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలి

సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీలను 60 సంవత్సరాలు దాటిన తరువాత రిటైర్ చేసి నామినల్ అమౌంట్ ఇస్తున్నారు. రిటైర్ అయిన అంగన్‌వాడీల అవస్థలు గమనించిన గుజరాత్ సిఐటియు అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ దశలవారీ న్యాయపోరాట ఫలితంగా 2022 ఏప్రిల్ 25న సుప్రీంకోర్టు 1972 గ్రాట్యూటీ చట్టాన్ని అంగన్‌వాడీలకు అమలు చేయాలని చారిత్రాత్మక తీర్పునిచ్చింది. తీర్పులో ప్రధానంగా ప్రపంచంలోనే అతి పెద్ద పథకమైన ఐసిడిఎస్‌లో పనిచేస్తున్న అంగన్‌వాడీలకు ఇస్తున్న గౌరవ వేతనం కూడా వేతనం నిర్వచనం కిందకి వస్తుందని, వేతనాలు పొందుతున్న అంగన్‌వాడీలు గ్రాట్యూటీకి అర్హులని స్పష్టంగా చెప్పింది.

మరో అంశం గ్రాట్యూటీ చట్టంలోని సెక్షన్ 1(3) (సి) అనుసరించి కేంద్ర ప్రభుత్వం 1997 ఏప్రిల్ 3న విద్యా సంస్థలను ఎస్టాబ్లిష్‌మెంట్లుగా పేర్కొంటూ ఉత్తర్వులిచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్లు ప్రీస్కూల్ నిర్వహిస్తున్నందున అవి ఎస్టాబ్లిష్‌మెంట్ నిర్వచనం కిందకొస్తాయి. అంగన్‌వాడీలు గ్రాట్యూటీకి అర్హులని చెప్పింది. ఈ తీర్పును గుజరాత్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తూ గ్రాట్యూటీ చెల్లిస్తున్నాయి. గ్రాట్యూటీతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 5 లక్షలు, ఆఖరి వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని అంగన్‌వాడీలు సమ్మెబాట పడుతున్నారు.

ఐసిడిఎస్ ను బలోపేతం చేయాలి

ఐసిడిఎస్ (సమగ్ర శిశు సంక్షేమ పథకం)ను స్థాపించిన తర్వాత పౌష్టికాహార లోపం తగ్గినప్పటికీ ఇంకా తీవ్రంగానే కొనసాగుతోంది. ఇటీవలి జాతీయ ఆరోగ్య సర్వే ప్రకారం నేటికీ 71.1 శాతం మంది ప్రజలకు పౌష్టికాహారం అందడం లేదు. సరైన తిండి లేక అనారోగ్యానికి గురై ఏటా 17 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో 18.7 శాతం పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు లేరు. వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లలు 35 శాతం ఉన్నారు.

ఈ పరిస్థితుల్లో ఐసిడిఎస్‌కు అదనపు నిధులు కేటాయించి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. కానీ నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐసిడిఎస్‌కు సరిపడా నిధులు కేటాయించలేదు. 2019-20 రూ.19,834.37 కోట్లు, 2020-21 రూ.20,105.38 కోట్లు, 2021-22 రూ.20,265 కోట్లు, 2022-23 రూ.20,554.31 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ పథకాన్ని కుదించటానికే నూతన విద్యా విధానం తీసుకొచ్చారు. అంగన్‌వాడీ సెంటర్లు, లబ్ధిదారుల జాబితాలను తగ్గించే పని ప్రారంభించారు. ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలని, ప్రీ స్కూలును బలోపేతం చేయాలని, నూతన విద్యా విధానం రద్దు చేయాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతున్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

పేదలందరికీ బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామనే ముఖ్యమంత్రి ప్రకటనలు ఆర్భాటంగా వుంటాయి. అంగన్‌వాడీలకు మాత్రం సంక్షేమ పథకాలు అమలు చేయటం లేదు. కనీసం వారి కుటుంబాలు కూడా సంక్షేమ పథకాలకు నోచుకోవడంలేదు. అతి తక్కువ జీతాలు ఇస్తున్నారు. ఇటీవల పోరాటం జరిపిన అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ సర్క్యులర్ ఇచ్చారు. దీని ప్రకారం హెల్పర్లు, మినీ వర్కర్లతో పాటు పట్టణాల్లో ఉన్న వారికి కూడా అమలు చేయాలి.

కానీ ఆచరణలో ఎవ్వరికీ సంక్షేమ పథకాలు అమలు చేయటం లేదు. గతంలో వచ్చే వితంతు పింఛను, వికలాంగుల పెన్షన్ కూడా ఈ ప్రభుత్వం తీసేసింది. ఇప్పటికైనా అంగన్‌వాడీలకు ఎటువంటి పరిమితులు విధించకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతున్నాం.

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలి

గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడీ సెంటర్‌లో వేడివేడిగా ఆహారాన్ని అందించాలని 'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ' పథకాన్ని ప్రారంభించారు. సరుకుల ధరలు పెరుగుతున్నా అందుకు తగ్గట్లుగా నిధుల కేటాయింపు పెంచలేదు. ప్రస్తుతం ఇస్తున్న సరుకులను సైతం దూరం చేయడానికిగాను గర్భిణులు, బాలింతలకు ఎఫ్.ఆర్.ఎస్. అమలు చేస్తున్నారు.

హెల్పర్ల ప్రమోషన్లో రాజకీయ జోక్యం అరికట్టాలి

అంగన్‌వాడీ సెంటర్‌కి వచ్చే ప్రీ స్కూల్ పిల్లలకు అమ్మ తరువాత అమ్మలా హెల్పర్లు అనేక సేవలు అందిస్తున్నారు. సెంటర్లలో ఖాళీలు ఏర్పడితే హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలన్న జీఓ అమలు చేయకుండా కొన్నిచోట్ల రాజకీయ నాయకులు, అధికారులు అడ్డుపడుతున్నారు. కుప్పం ప్రాజెక్టులో దాదాపు పది మంది హెల్పర్లకు ప్రమోషన్ అర్హత ఉన్నప్పటికీ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. పార్వతీపురంలో ప్రమోషన్ ఇచ్చినా జాయిన్ కాకుండా రాజకీయ నాయకులు అడ్డుపడుతున్నారు. చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కడప, ప్రకాశం సహా అనేక జిల్లాల్లో ప్రమోషన్లు ఇవ్వడం లేదు. కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితిలోకి నెట్టబడుతున్నారు. రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని, ప్రమోషన్లకు నిబంధనలు రూపొందించాలని కోరుతున్నాం.

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

రాష్ట్రంలో 55,605 మినీ సెంటర్లు ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో మారుమూల గ్రామాల్లో మినీవర్కర్లు సేవలందిస్తున్నారు. 400 జనాభా లోపు మినీ సెంటర్లు నడవాలి. 1,000-1200 జనాభా ఉన్న మినీ సెంటర్లలో వర్కర్ పని, హెల్పర్ పని చేయడం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రమోషన్లు, వేసవి సెలవులు అమలు కావడం లేదు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్‌తో సమానంగా వేతనాలు, ప్రమోషన్లు, వేసవి సెలవులు ఇవ్వాలని, సూపర్‌వైజర్ పోస్టులకు అర్హత కల్పించాలని కోరుతున్నాం.

విజిట్ల పేరుతో వేధింపులు ఆపాలి

అంగన్‌వాడీ సెంటర్ల పర్యవేక్షణకు ఐసిడిఎస్ అధికారు లు ఉన్నారు. అయినా ఇతర డిపార్ట్‌మెంట్లు, ఫుడ్ కమిషనర్, ఎమ్మార్వో, ఎం.డి.ఓ, రాజకీయ నాయకులు రకరకాల పద్ధతుల్లో వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఉయ్యూరులో ఓ అంగన్‌వాడీ వర్కర్ సెంటర్‌లోనే గుండెపోటు వచ్చి చనిపోయింది. గుడివాడలో అధికారుల వేధింపుల వల్ల వర్కర్ ఆత్మహత్యా ప్రయత్నం చేసింది.

గత 48 సంవత్సరాలుగా పేద ప్రజలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్న పరిస్థితుల్లో...ఈ నెల 8వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా సెంటర్లను మూసివేసి...సమ్మె చేయాలని నిర్ణయించుకున్నాం. మా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జరిగే ఈ సమ్మె విజయవంతం కావడానికి అన్ని తరగతుల ప్రజానీకం విశాల మద్దతు ఇవ్వాల్సిందిగా కోరుతున్నాం.

/ వ్యాసకర్త : ఎ.పి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి /





ఖతార్ పాలకుడితో మోడీ భేటీ

- భారతీయుల ఉరిశిక్ష అంశం ప్రస్తావనపై మౌనం

న్యూఢిల్లీ : కాప్ 28 సదస్సుకు దుబాయ్ వెళ్లిన ప్రధాని మోడీ అక్కడ ఖతార్ అమీర్‌తో కాసేపు మాట్లాడినట్లు వెల్లడించారు. ద్వైపాక్షిక సంబంధాలు, ఖతార్‌లోని బారత కమ్యూనిటీ సంక్షేమం గురించి మాట్లాడుకున్నట్లు మోడీ ట్వీట్ చేశారు. వీరిద్దరు కలుసుకున్నట్లు శనివారమే వీడియో క్లిప్పింగ్ బయటకు వచ్చినా అధికారికంగా ప్రకటన లేదు. దుబాయ్ నుంచి వచ్చిన తర్వాతే మోడీ పోస్టు పెట్టారు. ఎనిమిది మంది భారతీయులకు మరణ శిక్ష విధిస్తూ ఖతార్ కోర్టు తీర్పు ఇచ్చిన తరువాత వీరి భేటీ జరిగింది. ఈ అంశాన్ని ఖతార్ పాలకుడితో ప్రస్తావించారా? లేదా? అనేది తెలియరాలేదు. ఖతార్ రక్షణ సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి నిర్దేశించిన ఒమన్ కంపెనీ నియమించిన ఎనిమిది మంది భారత మాజీ నేవీ అధికారులపై గూఢచర్యం ఆరోపణలపై కోర్టు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా అప్పీల్ చేసుకునే క్రమం కొనసాగుతోంది. ఇప్పటివరకు ఒక విడత విచారణ జరిగింది.

యుజిసి ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

- సిపిఎం ఎంపి వి శివదాసన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని యూనివర్సిటీలు, కాలేజీల్లో ప్రధాని నరేంద్రమోడీ ఫొటోతో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం ఎంపి వి శివదాసన్ డిమాండ్ చేశారు. యుజిసి చర్య దేశంలోని ఉన్నత విద్యా రంగాన్ని అవమానించడమేనని అన్నారు. సంకుచిత రాజకీయ ప్రచారానికి విద్యార్థులను సాధనాలుగా మార్చే కుతంత్రం జరుగుతోందని అన్నారు. యుజిసి వంటి ముఖ్యమైన సంస్థల సారథ్యంలో ఇలాంటి ఉత్తర్వులు ఇచ్చే వ్యక్తులు ఉండడం దేశ ప్రయోజనాలకు మేలు చేయదని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకునేలా జోక్యం చేసుకోవాలని ప్రధాని మోడీకి వి శివదాసన్ లేఖ రాశారు.

ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా సృష్టించిన ఓటుకు నోటు కేసులో విచారణను సుప్రీంకోర్టు జనవరి నెలకు వాయిదా వేసింది. 'ఓటుకు నోటు' కేసు నుంచి తనను తప్పించాలంటూ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఇటీవల విచారణ సందర్భంగా రేవంత్ రెడ్డి వేసిన రెండు పిటిషన్లను కొట్టేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. వెంకట వీరయ్య పిటిషన్‌ను వాయిదా వేసింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టితో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, తెలంగాణ ప్రభుత్వం తరపున స్టాండింగ్ కౌన్సిల్ శ్రీహర్ష పిచారా హాజరయ్యారు. ప్రస్తుతం తన ఆరోగ్యం బాగాలేనందున వాదనలు కొనసాగించలేనని సిద్ధార్థ లూథ్రా కోర్టుకు నివేదించారు. అందువల్ల ఈ పిటిషన్‌తో పాటు దీనికి అనుబంధంగా మరో పిటిషన్ విచారణను వాయిదా వేయాలని అభ్యర్థించారు. జనవరిలో విచారణ చేపట్టేందుకు జస్టిస్ సంజీవ్ ఖన్నా అంగీకారం తెలపగా.. జనవరి 6 కాకుండా మరే ఇతర రోజైనా విచారణ చేపట్టాలని మరోసారి కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ధర్మాసనం కేసు విచారణను జనవరికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది.

ఆస్ట్రేలియా సెనెటర్‌గా

భారత సంతతికి చెందిన దేవ్‌శర్మ ప్రమాణం



మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో భారత సంతతికి చెందిన మొదటి పార్లమెంట్ సభ్యుడు దేవ్‌శర్మ సోమవారం సెనెటర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. న్యూ సౌత్ వేల్స్‌లో జరిగిన సెనెట్ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. న్యూ సౌత్‌వేల్స్ మాజీ మంత్రి ఆండ్రూ కాన్‌స్టన్స్‌ను ఆయన 251-206 ఓట్ల తేడాతో ఓడించారు. సెనెట్ నుండి రిటైరవుతున్న మాజీ విదేశాంగ మంత్రి మారిసె పాయనె స్థానంలో దేవ్ శర్మ నియమితులు కానున్నారు. ఫెడరల్ లిబరల్ బృందంలో అదనంగా వస్తున్న శర్మకు స్వాగతం అంటూ లిబరల్ పార్టీ డిప్యూటీ నేత సుశాన్ లే వ్యాఖ్యానించారు. విదేశాంగ విధానాలకు సంబంధించి మేధావి అయిన దేవ్‌కు పార్లమెంట్, సీనియర్ దౌత్య విభాగాల్లో అపార అనుభవం వుందని లే పేర్కొన్నారు. 2013-2017 మధ్య కాలంలో ఇజ్రాయిల్‌కు ఆస్ట్రేలియా రాయబారిగా శర్మ పనిచేశారు.

నేరాలు పెరిగి పోతున్నాయి

- ఎక్కువగా మహిళలు, చిన్నారులపైనే
- ఎస్‌సిలు, ఎస్‌టిలపై కూడా...
- ఆత్మహత్యలు, ప్రమాద మరణాలూ పెరిగిపోయాయి
- జాతీయ క్రైమ్ బ్యూరో నివేదిక విడుదల



న్యూఢిల్లీ : గత సంవత్సరం దేశంలో మహిళలు, చిన్నారులు, ఎస్‌సిలు, ఎస్‌టిలపై నేరాలు పెరిగాయి. సైబర్ నేరాల సంఖ్యా అధికంగానే ఉంది. ఆకస్మిక మరణాలు, ఆత్మహత్యలు కూడా ఎక్కువగానే చోటుచేసుకున్నాయి. ఇవేవో ప్రతిపక్ష పార్టీలు చేసిన ఆరోపణలు కావు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) ఆదివారం విడుదల చేసిన వార్షిక నేరాల నివేదికలోని చేదునిజాలు. దేశంలో 2022లో జరిగిన వివిధ రకాల నేరాల చిట్టాను ఈ నివేదిక బయటపెట్టింది. 2021తో పోలిస్తే గత సంవత్సరంలో మొత్తం మీద నేరాల రేటు 7శాతం నుంచి 6.9శాతానికి తగ్గిందని నివేదిక తెలిపింది. మహిళలు, పిల్లలు, ఎస్‌సిలు, ఎస్‌టిలపై నేరాలతోపాటు సైబర్ నేరాలు పెరిగాయి.

ప్రమాదాల కారణంగా జరిగిన మరణాలు, ఆత్మహత్యలకు సంబంధించిన నివేదికను (ఎడిఎస్ఐ) కూడా ఎన్‌సిఆర్‌బి విడుదల చేసింది. దీని ప్రకారం 2021తో పోలిస్తే 2022లో ఆకస్మిక మరణాల సంఖ్య 11.6శాతం పెరిగింది. గత సంవత్సరంలో 56,653 మంది హఠాత్తుగా చనిపోయారు. వీరిలో గుండెపోటు కారణంగా 32,410 మంది ప్రాణాలు కోల్పోగా, 24,243 మరణాలకు వేర్వేరు కారణాలు ఉన్నాయి. 45-60 సంవత్సరాల మధ్య వయస్కులు ఎక్కువగా... అంటే 19,456 మంది మరణించారు. భారత వైద్య పరిశోధనా మండలి, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా అధ్యయనం ప్రకారం ప్రపంచంలో గుండె జబ్బులతో బాధపడుతున్న వారిలో 60% మంది మన దేశంలోనే ఉన్నారు.

ఈ మరణాలూ అధికమే

ఆత్మహత్యలకు పాల్పడిన వారి సంఖ్య 2021తో పోలిస్తే గత సంవత్సరం 1,64,033 నుంచి 1,70,924కు పెరిగింది. ఇదే కాలంలో ప్రమాద మరణాల సంఖ్య 3,97,530 నుంచి 4,30,504కు పెరిగింది. భారత చరిత్రలో ఆత్మహత్యల రేటు 2021లోనే అత్యధికంగా నమోదైంది. ఆ సంవత్సరం ప్రతి లక్ష మందిలో 12 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండవచ్చునని అంచనా. ఆత్మహత్యల కేసులు పూర్తి స్థాయిలో వెలుగు చూడకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. మరణ ధ్రువపత్రం లభించకపోవడం, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన వాస్తవాలు బయటపెట్టకపోవడం, ఆత్మహత్యల సమాచారాన్ని వెల్లడించకపోవడం, ఆత్మహత్య చేసుకుంటే బీమా సొమ్ము అందకపోవడం వంటి కారణాల రీత్యా కేసులు పెద్దగా బయటపడడం లేదు.

2021లో అత్యధికం

గత సంవత్సరంలో మహిళలపై నేరాలకు సంబంధించి కనీసం 4.45,256 కేసులు నమోదయ్యాయి. 2021తో పోలిస్తే ఇది 4% ఎక్కువ. వీటిలో భర్త లేదా అతని బంధువుల దాష్టీకం, అపహరణలు, దాడులు, వేధింపులు, అత్యాచారాలే అధికంగా ఉన్నాయి. ప్రపంచంలో ప్రతి ముగ్గురు మహిళలలో ఒకరు లింగ వివక్షకు, హింసకు గురవుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థను ఉటంకిస్తూ బిబిసి తెలిపింది. మన దేశంలో కూడా ఈ సంఖ్య అలాగే ఉంది. 2021లో దేశంలో అత్యధిక సంఖ్యలో మహిళలపై నేరాలు జరిగాయి. 2016 నుండి జరిగిన నేరాలతో పోలిస్తే ఇవి 26.35% ఎక్కువ.

చిన్నారులు, వృద్ధులు, ఎస్‌సిలు, ఎస్‌టిలపై కూడా...

చిన్నారులపై జరుగుతున్న నేరాలలో కూడా పెరుగుదల కన్పించింది. 2022లో ఈ తరహా నేరాలు 1,62,449 చోటుచేసుకున్నాయి. 2021తో పోలిస్తే ఇవి 8.7శాతం అధికం. ఇక వృద్ధులు, ఎస్‌సిలు, ఎస్‌టిలపై నేరాలు, ఆర్థిక నేరాలలో కూడా గణనీయమైన పెరుగుదల కన్పించింది. 60 సంవత్సరాలు దాటిన వారిపై జరిగిన నేరాలకు సంబంధించి 28,545 కేసులు నమోదయ్యాయి. 2021తో పోలిస్తే ఇవి 9.3% ఎక్కువ. ఎస్‌సిలపై నేరాలకు సంబంధించి 57,582 కేసులు (2021లో కంటే 13.1% అధికం) నమోదయ్యాయి. ఎస్‌టిలపై 10,064 నేరాల కేసులు (2021లో కంటే 14.3శాతం ఎక్కువ) నమోదయ్యాయి. ఆర్థిక అవకతవకలకు సంబంధించి కనీసం 1,93,385 (2021లో కంటే 11.1 శాతం ఎక్కువ) కేసులు, సైబర్ నేరాలకు సంబంధించి 65,893 (2021లో కంటే 24.4 శాతం అధికం) కేసులు నమోదయ్యాయని నివేదిక వివరించింది. వీటితో పాటు 3,434 లైంగిక దోపిడీ కేసులు కూడా నమోదు చేశారు.

పుస్తకం రాసిన రెండేళ్లకు డాక్టర్ కఫీల్‌ఖాన్‌పై కేసు

- యుపి పోలీసుల నిర్వాకం



న్యూఢిల్లీ : గోరఖ్‌పూర్ ఆక్సిజన్ విషాదంపై 2021లో పుస్తకం రాసి ప్రచురించినందుకు ఉత్తరప్రదేశ్‌కి చెందిన డాక్టర్ కఫీల్ ఖాన్‌పై తాజాగా క్రిమినల్ కేసు నమోదైంది. తన పుస్తకంతో ఆయన మైనారిటీలను రెచ్చగొడుతున్నారంటూ పోలీసులు అభియోగాలు నమోదు చేశారు. గోరఖ్‌పూర్‌లోని బాబా రాఘవ్ దాస్ ఆస్పత్రిలో 2017లో ఆక్సిజన్ అందక అనేకమంది చిన్నారులు మరణించారు. ఆ ఘటనపై కఫీల్ "గోరఖ్‌పూర్ హాస్పిటల్ ట్రాజెడీ : ఎ డాక్టర్స్ మెమోయిర్ ఆఫ్ ఎ డెడ్లీ మెడికల్ క్రైసిస్" అనే శీర్షికతో ఒక పుస్తకం రాశారు. దానిపై ఈ నెల 1వ తేదీన కఫీల్‌పై కేసు నమోదైంది. ఇన్నేళ్ల తర్వాత ఈ కేసు నమోదవడంపై ఖాన్ అయోమయానికి గురయ్యారు. ఇటీవల విడుదలై విజయం సాధించిన జవాను సినిమాలోని ఒక సన్నివేశాన్ని అభినందిస్తూ షారుఖ్‌ఖాన్‌కు రాసిన లేఖే ఈ కేసు పెట్టడానికి కారణంగా కనిపిస్తోందని ఆయన చెప్పారు. సొంత రాష్ట్రమైన యుపిలో వేధింపులు భరించలేక ఆయన వేరే నగరానికి వచ్చి వుంటున్నారు. గోరఖ్‌పూర్ పిల్లల వైద్యుని జీవితాన్ని పరోక్షంగా ఆధారంగా చేసుకుని కొన్ని సన్నివేశాలను జవాన్ సినిమాలో చిత్రీకరించారని తాను విశ్వసిస్తున్నానని, అందుకే ఆయనను ప్రశంసిస్తూ లేఖ రాశానని ఆ కారణం వల్లనే ఈనాడు కేసు నమోదైందని ఖాన్ చెప్పారు. పాలనాపరమైన నిర్లక్ష్యం నుండి అందరి దృష్టిని మళ్లించేందుకే తనను బలిపశువును చేశారని పేర్కొంటూ తాను ఎదుర్కొన్న వేధింపులను కూడా ఆయన ఆ పుస్తకంలో వివరించారు. స్థానిక వ్యక్తి మనీష్ శుక్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్నోలోని కృష్ణనగర్ పోలీసు స్టేషన్‌లో ఖాన్‌తో సహా మరో ముగ్గురు, నలుగురిపై కేసు నమోదైంది.

ఇండోనేషియాలో పేలిన అగ్నిపర్వతం

- 11మంది మృతి, 3వేల మీటర్ల ఎత్తున బూడిద మేఘాలు

పడాంగ్ : పశ్చిమ ఇండోనేషియాలో అగ్నిపర్వతం విస్ఫోటనం చెందడంతో గల్లంతైన వారిని కనుగొనేందుకు సహాయ బృందాలు రాత్రంతా గాలిస్తున్న తరుణంలో 11మంది హైకర్లు మరణించగా వారిని కనుగొన్నారని అధికారులు సోమవారం తెలిపారు. మరో ముగ్గురిని కాపాడారు. సుమత్రా దీవిలోని మౌంట్ మరపి అగ్నిపర్వతం ఆదివారం విస్ఫోటనం చెందింది. 2,891 మీటర్ల ఎత్తున్న ఈ పర్వతం 3వేల మీటర్ల ఎత్తున బూడిద మేఘాలను విరజిమ్ముతోందని స్థానిక అధికారులు చెప్పారు. దీంతో సమీప గ్రామాలపై బూడిద, రాళ్ళు రప్పలు వర్షంలా కురిశాయి. వారాంతంలో ఈ పర్వతంపైకి వచ్చిన హైకర్ల సంఖ్య 75 అని స్థానిక, జాతీయ సంస్థలు తెలియచేశాయి. కానీ క్రేటర్ సమీపంలో 11మంది మృత దేహాలను సహాయక బృందాలు సోమవారం ఉదయం కనుగొన్నాయని అధికారులు చెప్పారు. ఖాళీ చేయకుండా కొండపైనే వున్నవారు 26మందని, వారిలో 14మందిని కనుగొన్నామని, 11మంది చనిపోగా, ముగ్గురు జీవించే వున్నారని పడాంగ్ సహాయక సంస్థ అధిపతి అబ్దుల్ మాలిక్ తెలిపారు. మరో 12మంది ఆచూకీ ఇంకా తెలియాల్సి వుందని అన్నారు. 49మంది ఇప్పటికే కొండ దిగి సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. క్రేటర్ సమీపంలో కనుగొన్న ముగ్గురు చాలా బలహీనంగా వున్నారని, వారి వంటిపై కాలిన గాయాలున్నాయని అధికారులు చెప్పారు.



గాజాలో పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతను ఆపాలని కోరుతూ శనివారం బ్రాడ్‌ఫోర్డ్‌లో వేలాది మందితో ర్యాలీ జరిగింది. 'క్యాంపెయిన్ ఎగినెస్ట్ ఆర్మ్స్ ట్రేడ్' ఇచ్చిన పిలుపు మేరకు బ్రిటన్‌లో 16 ముఖ్య పట్టణాల్లో ఈ సంఘీభావ ర్యాలీలు జరిగాయి.

మృతదేహాలతో నిండిపోతున్న గాజా ఆస్పత్రులు

- ఇజ్రాయిల్ దాడుల్లో 3 రోజుల్లోనే 800మందికి పైగా మృతి

గాజా : మృతదేహాలతో గాజా ఆస్పత్రులు నిండిపోతున్నాయని గాజా ఆరోగ్యశాఖ డైరెక్టర్ జనరల్ మునీర్ అల్ బర్ష్ తెలిపారు. కాల్పుల విరమణ ముగిసిన తర్వాత వరుసగా నాలుగు రోజుల నుండి ఇజ్రాయిల్ మిలటరీ దక్షిణ గాజాలో విరుచుకు పడుతోంది. శనివారం నుంచి ఇప్పటివరకు 800మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని అధికారులు తెలిపారు. అంబులెన్సులు, వైద్య సిబ్బందిని పదే పదే లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. అల్ అద్వా ఆస్పత్రికి తీసుకెళుతున్న ఒక ఆరోగ్య సంరక్షణ కార్యకర్తని కాల్చి చంపారు. 40వేల మంది గాయపడితే, 400మంది రఫా క్రాసింగ్‌ను చేరుకోగలిగారని డైరెక్టర్ తెలిపారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో తెల్లవారుజామున ఇద్దరు పాలస్తీనియన్లను కాల్చి చంపగా, 60మందిని అరెస్టు చేశారు. రెడ్‌క్రాస్ చీఫ్ సోమవారం గాజాలో పర్యటించారు. తక్షణమే సాయం అందాలని ఆయన అన్నారు. సోమవారం ఉదయం నుండి ఇజ్రాయిల్ ట్యాంకులు, సాయుధ వాహనాలు తూర్పు ప్రాంతం నుండి ఖాన్ యునిస్ దిశగా వెళుతున్నాయి.



పార్లమెంట్ మార్చ్‌లో మాట్లాడుతున్న బి వెంకట్

మనువాద శక్తులపై ఐక్య పోరు

(మొదటిపేజీ తరువాయి)

వాటా ఉండేలా చట్టాన్ని రూపొందించి, దానిని కఠినంగా అమలు చేయాలి., స్త్రీలు, పురుషుల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ఆహారం, సురక్షితమైన తాగునీరు, దుస్తులు, ఇళ్లు, ప్రజారోగ్యం, వైద్య సంరక్షణ, సామాజిక భద్రత, సామాజిక సేవలు, అన్ని ప్రజా సౌకర్యాలు, స్థలాలకు యాక్సెస్‌తో తగిన జీవన ప్రమాణాల హక్కులను సమానంగా పరిరక్షించాలి. గ్రామీణ భూమిలేని వారికి జీవన వేతనం, ఐదెకరాల భూమి యాజమాన్యాన్ని నిర్ధారించాలి. ఎస్‌సిలకు కేటాయించిన భూమి మొత్తం వారు స్వాధీనం చేసుకునేలా చూడాలి. బాండెడ్ లేబర్ సిస్టమ్ (నిర్మూలన) చట్టం, 1976ని అమలు చేయాలి. బాల కార్మికులను వెంటనే రద్దు చేయాలి., అన్ని ప్రభుత్వ సేవలు, కాంట్రాక్టులలో ఎస్‌సిలకు దామాషా రిజర్వేషన్ ఉండేలా చూడాలి. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు తప్పనిసరిగా సప్లయర్ డైవర్సిటీ, డీలర్‌షిప్ డైవర్సిటీని అమలు చేయాలి., నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలి. ఎస్‌సిలందరికీ ఉచిత, నాణ్యమైన విద్యను హామీ ఇవ్వాలి. తగిన స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించేలా చూడాలి. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో రిజర్వేషన్ కోటాను అమలు చేయాలి. విద్యాసంస్థల్లో కులవివక్షకు వ్యతిరేకంగా చట్టం చేయాలి.ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ తప్పనిసరి చేయాలి. ప్రభుత్వ రంగాల్లో ఉన్న బ్యాక్‌లాగ్‌ను వెంటనే భర్తీ చేసి పదోన్నతుల్లో రిజర్వేషన్లను పునరుద్ధరించాలి., మాన్యువల్ స్కావెంజింగ్, మాన్యువల్ శానిటరీ వర్క్ అనే అమానవీయ పద్ధతిని తొలగించాలి. పాటించని వారందరినీ ప్రాసిక్యూట్ చేసి శిక్షించాలి., ఉపాధి హామీ పథకాన్ని షరతులు, అడ్డంకులు లేకుండా తప్పనిసరిగా అమలు చేయాలి. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలి. పనిదినాలు 200కు పెంచాలి. రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలి., ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని స్ఫూర్తితో అమలు చేయాలి. నేరస్తులను చట్టాల ప్రకారం కఠినంగా శిక్షించాలి. వారి విధులను విస్మరించినందుకు దోషులుగా తేలిన పరిపాలనా సభ్యులకు తప్పనిసరిగా శిక్ష విధించాలి. ఈ చట్టం కింద నేరస్తులు పోలీసు స్టేషన్‌లోనే బెయిల్ పొందేందుకు అనర్హులను చేయాలి. సత్వర న్యాయం జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి., కేంద్ర బడ్జెట్ సబ్ ప్లాన్‌లో ఎస్‌సిలకు కేటాయించిన నిధులను వారి కోసం మాత్రమే వినియోగించాలి. రాష్ట్రాలకు కూడా ఇలాంటి చట్టాలు రూపొందించాలి. మొత్తం జనాభాలో ఎస్‌సి, ఎస్‌టిల నిష్పత్తి ప్రకారం బడ్జెట్ కేటాయింపులు జరగాలి. ఈ నిధులను మళ్లించడం, లేదా ఉపయోగించకపోవడంపై నేరంగా పరిగణించబడాలి. కులగణన చేపట్టాలి., సాధారణ జనాభా గణనతోపాటు కులగణన కూడా చేపట్టాలి.

అవినీతి కేసులో నెతన్యాహుపై విచారణ పునరుద్ధరణ

జెరూసలేం : ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అవినీతి విచారణ సోమవారం పునరుద్ధరించబడింది. హమాస్ దాడితో నెలకొన్న అత్యవసర పరిస్థితుల్లో ఇచ్చిన సస్పెన్షన్ గడువు గత వారంలో ముగియడంతో తిరిగి విచారణను చేపట్టారు. మూడేళ్ళుగా ఈ విచారణ కొనసాగుతోంది. మూడు కేసుల్లో అవినీతి, విశ్వాస ఉల్లంఘన, ముడుపులు స్వీకరించడం వంటి అభియోగాలపై విచారణను ఎదుర్కొంటున్నారు. కమ్యూనికేషన్స్ మంత్రిగా వున్న సమయంలో ఇజ్రాయిల్ టెలికం దిగ్గజ కంపెనీ బెజెక్కుకు కొన్ని ప్రోత్సాహకాలను ఇచ్చారన్నది ఒక కేసులో అభియోగం. మరో కేసులో ఇజ్రాయిల్ హాలివుడ్ నిర్మాత ఆర్నాన్ మిల్చాన్ లక్షల డాలర్ల మేర పన్నులు చెల్లించకుండా వుండేలా చూసేందుకు 2007- 2016 మధ్య కాలంలో 1,89,000 డాలర్ల విలువైన విలాసవంతమైన బహుమతులను అందుకున్నారని ఆరోపణలున్నాయి. ముడుపుల అభియోగాలు రుజువైతే పదేళ్లవరకు జైలు శిక్ష లేదా జరిమానా పడుతుంది. అవినీతి, విశ్వాస ఉల్లంఘనలకు మూడేళ్ళ వరకు జైలుశిక్ష పడుతుంది. సిట్టింగ్ ప్రధానిపై విచారణ ఇదే ప్రథమం.

ఇండియా ఫోరం బలోపేతానికి కృషి

- సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇండియా ఫోరం బలోపేతం దేశానికి అవసరమని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. దేశ లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు 'ఇండియా' మరింత బలోపేతం కావాలని అన్నారు. ఇందుకోసం సిపిఎం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఏచూరి సోమవారం నాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ,. 'ఇండియా ఫోరంలోని అన్ని పార్టీల సీనియర్ నేతలతో సంప్రదించి నిర్ణయాలు తీసుకుంటారు. కాబట్టి సమన్వయ కమిటీలో సభ్యులుగా లేకపోవడం అడ్డంకి కాబోదని అన్నారు. జెడిఎస్ కేరళ యూనిట్ జాతీయ నాయకత్వం నుంచి దూరమైందని అన్నారు. జాతీయ రాజకీయ పరిస్థితులతోపాటు, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్టీ నిర్మాణ అంశాలపై శుక్రవారం ప్రారంభమయ్యే సిపిఎం కేంద్ర కమిటీ సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

ఆప్ ఎంపి రాఘవ్ చద్దాపై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ ఎంపి రాఘవ్ చద్దాపై పడిన సస్పెన్షన్ వేటు ఎత్తి వేశారు. ఈ మేరకు సోమవారం రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్ సస్పెన్షన్ రద్దు చేశారు. ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు ఒక తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. సభా కార్యక్రమాలకు హాజరుకాకుండా విధించిన సస్పెన్షన్ కారణంగా ఇంతవరకూ ఆయనకు పడిన శిక్ష సరిపోతుందని, ఆయన సస్పెన్షన్ రద్దు చేసే విషయాన్ని సభ పరిశీలించాలని ఆ తీర్మానంలో ఆయన పేర్కొన్నారు. సస్పెన్షన్‌ను రద్దు చేయాలని రాజ్యసభ ఛైర్మన్ తీసుకున్న నిర్ణయంపై రాఘవ్ చద్దా సంతోషం వ్యక్తం చేశారు. 115 రోజుల సస్పెన్షన్ కాలంలో తనను ఆదరించి, ఆశీస్సులు ఇచ్చిన ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను సాగిస్తున్న పోరాటానికి అందరూ ధైర్యం ఇచ్చారని అన్నారు. గత ఆగస్టు 11న రాఘవ్ చద్దా రాజ్యసభ నుంచి సస్పెండయ్యారు. దేశ రాజధాని ఢిల్లీ (సవరణ)-2023పై ప్రతిపాదిత సెలక్ట్ కమిటీకి అనుమతి తీసుకోకుండానే కొందరు సభ్యుల పేర్లను చేర్చినందుకు ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. రాఘవ్ చద్దా సుప్రీంకోర్టులో సవాలు చేశారు. బేషరతు క్షమాపణకు ఆయన అంగీకరించడంతో ఆయన క్షమాపణను సానుకూలంగా పరిశీలించాలని రాజ్యసభ ఛైర్మన్‌కు అత్యున్నత న్యాయస్థానం సూచించింది.

క్యూబాకు మద్దతుగా ఎస్‌ఎఫ్‌ఐ పది లక్షల సంతకాల సేకరణ

- క్యూబా రాయబారికి అందజేత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

క్యూబా విప్లవ వీరుడు ఫిడెల్ కాస్ట్రో రూజ్ భౌతికంగా దూరమై ఏడో వార్షికోత్సవం సందర్భంగా క్యూబాకు సంఘీభావంగా ఎస్‌ఎఫ్‌ఐ ఒక మిలియన్ సంతకాల సేకరణతో ప్రచారం చేసింది. 'క్యూబాను జీవించనివ్వండి' పేరుతో అగ్రరాజ్య దాష్టీకాలను నిరసిస్తూ విస్తృతంగా ప్రచారం చేశారు. సోమవారం నాడిక్కడ రిపబ్లిక్ ఆఫ్ క్యూబా రాయబారి హెచ్‌ఇ అల్జాండ్రో సిమాన్‌కాస్ మారిన్‌ను తన నివాసంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా దేశంలోని క్యాంపస్‌లలో సేకరించిన సంతకాలను క్యూబా రాయబారికి ఎస్‌ఎఫ్‌ఐ నేతలు అందజేశారు. ప్రపంచమంతా వైద్యులను పంపిస్తూ, ఆరోగ్యరంగంలో విశేష సేవలందిస్తున్న క్యూబాను తీవ్రవాద స్పాన్సర్ల జాబితాలో అమెరికా పెట్టడం ఘోరమని, వెంటనే తొలగించాలని సంతకాల సేకరణ ప్రచారంలో కోరినట్లు ఎస్‌ఎఫ్‌ఐ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూఖ్ బిస్వాస్, ఉపాధ్యక్షులు నితీష్ నారాయణన్, సహాయ కార్యదర్శి ఆదర్శ్ ఎం సాజి, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి మయాంక్ ఆజాద్, మాజీ అఖిల భారత నాయకుడు ఎంఎ బేబీ, ఆర్ అరుణ్ కుమార్, డివైఎఫ్‌ఐ నాయకుడు సంజీవ్ కుమార్, ఎఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి తిరుమల రామన్ పాల్గొన్నారు.

రాజ్యసభలో పోస్టాఫీస్ సవరణ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

జరిపించాలని డిమాండ్ చేశారు. ఉత్తరకాశీ సొరంగంలో ప్రవేశ ద్వారం నుండి 200 మీటర్ల దూరంలో నవంబర్ 12న కొంత భాగం కూలిపోయి 41 మంది కార్మికులు చిక్కుకున్నారని తెలిపారు. దాదాపు 17 రోజుల పాటు ఆశ, నిరాశ మధ్య కొట్టుమిట్టాడారని, ఎట్టకేలకు రెస్క్యూ టీమ్ నవంబర్ 28న కార్మికులందరినీ బయటకు తీసిందని తెలిపారు. ఈ సంఘటన చాలా బాధాకరమని అన్నారు. టన్నెలింగ్ కంపెనీ అన్ని భద్రతా చర్యలు, నియమాలు, నిబంధనలను ఉల్లంఘించిందని విమర్శించారు. పారదర్శక, న్యాయమైన విచారణ చాలా అవసరమని అన్నారు. సిల్క్యారా ఒక్కటే ఘటన కాదని, ఇలాంటి ఘటనలు ఈ ప్రాంతంలో ఇంతకు ముందు కూడా జరిగాయని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్ ఎన్‌హెచ్‌ఐడిసిఎల్ సొరంగాన్ని నిర్మిస్తోందన్నారు.

వాయు కాలుష్యంతో 21 లక్షల మరణాలు : ఆప్

ఆప్‌కి చెందిన సంత్ బల్బీర్ సింగ్ వాయు కాలుష్య సమస్యను లేవనెత్తారు. వాయు కాలుష్యం కారణంగా ఏటా దాదాపు 21 లక్షల మంది మరణిస్తున్నారని తెలిపారు. ఏడాదిలో ఢిల్లీలో ఒక రోజు, ముంబాయిలో ఐదు రోజులు, చెన్నైలో 15 రోజులు మాత్రమే గాలి శుభ్రంగా ఉందని సింగ్ పేర్కొన్నారు. వాయు కాలుష్యం గురించి చర్చలు వచ్చినప్పుడల్లా, పంజాబ్ రైతులు పంట వ్యర్థాలను తగులబెట్టడమే కారణమని అంటున్నారని అన్నారు. పంజాబ్‌లోని రైతులకు కూడా అలా కాల్చడం ఇష్టంలేదని చెప్పారు. వ్యర్థాలు కుళ్లి ఎరువుగా మారేలా చేసే కెమికల్స్‌ను కొనుగోలు చేసేందుకు కేంద్రప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తే రైతులు వ్యర్థాలను కాల్చాల్సిన అవసరం ఉండదని తెలిపారు.






మీకోసం

బట్టలపై నూనె ఒలికితే ఉప్పు అద్దిన నిమ్మకాయ ముక్కతో రుద్దాలి.

జీవన సౌరభం

ప్రశ్నించనిదే సమాధానం దొరకదు. ప్రయత్నించనిదే విజయమూ దక్కదు.

రైతు బిడ్డలు




అనగనగా శుక్లాల్ పేట అనే గ్రామం ఉంది. గ్రామంలో రామయ్య, లక్ష్మీ అనే దంపతులు వ్యవసాయం చేస్తూ జీవితం గడుపుతున్నారు. వారికి రాము, మధు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరూ ఎనిమిదవ తరగతి చదువుతున్నారు. ఒకసారి రామయ్య, లక్ష్మీలకు బాగా జ్వరం వచ్చింది. వారం రోజులపాటు ఇంట్లోనే ఉండిపోయారు.

ఇంట్లో ఉన్నా, పొలం గురించి వారికి బెంగ పట్టుకుంది. పంట ఎండిపోయిందేమోనని దిగులు పడిపోయారు. జ్వరం తగ్గగానే పొలం వద్దకు వెళ్లి చూశారు. మడినిండా నీళ్ల ఉండి, పొలం పచ్చగా ఉండడంతో ఆశ్చర్యపోయారు. బావి దగ్గర ఏదో అలజడి కావడంతో అటువైపు వెళ్లి చూశారు. రాము, మధు బావిలో నుంచి నీళ్ల తోడుతూ పొలానికి పోస్తున్నారు. దంపతులిద్దరూ బిడ్డలను చూసి సంతోషించారు.

అప్పటి నుండి రాము, మధు ప్రతిరోజూ బడికి వెళుతూనే తీరిక సమయాల్లో వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు సహాయంగా ఉంటున్నారు. సెలవు రోజు తప్పకుండా పొలం పని చేస్తూ, పొలం వద్దకే పుస్తకాలు తెచ్చుకుని చదువుకుంటున్నారు. బాగా చదువుకొని, ఉద్యోగాలు పొందారు. ఉద్యోగాలు చేస్తూ కూడా తీరిక సమయంలో వ్యవసాయ పనులు చేశారు. చిన్నప్పటి నుండి రాము, మధుని చూస్తున్న గ్రామస్తులు వారిని రైతుబిడ్డలుగా పిలవడం మొదలుపెట్టారు. ఇప్పుడు ఆ ఊరిలో రాము, మధుని ఆదర్శంగా తీసుకుని, ఎంతోమంది చదువుతూనే, తల్లిదండ్రులకు వ్యవసాయ పనులలో సహాయంగా ఉంటున్నారు.



- మాలోత్ లక్ష్మణ్,
8వ తరగతి,
జెడ్‌పిహెచ్, హవేలీ ఘనపూర్
మెదక్ జిల్లా,
95508 09625.





సరైన ఆకృతి చెప్పండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు ఇచ్చాం. వాటి మధ్యలో కొన్ని ఆకృతుల రూపంలో బొమ్మ కత్తిరించి ఉంది. కింద ఉన్న క్లూ ఆధారంగా ఏ ఆకృతి ఏ బొమ్మదో రాయండి.

నేను గీసిన బొమ్మ



జి. వెంకట సాయి మహీధర్,
6వ తరగతి,
నల్లజర్ల,
తూర్పు గోదావరి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఈ గ్రాండ్ మాస్టర్ల వెనుక ఓ అమ్మ..



గృహిణికి ఏం తెలుసు? ఇల్లు చక్కబెట్టుకోవడం, భర్తకి, పిల్లలకి వండిపెట్టడం, పిల్లలను స్కూళ్లకి పంపించడం, వేళకి తినిపించడం! ఇంతకు మించి ఏం పాటు చేస్తుంది? ఏం విరగపడుతుంది? అనుకునే వాళ్లకి తన ఇద్దరు బిడ్డలని దేశం గర్వపడే గ్రాండ్ మాస్టర్లుగా తీర్చిదిద్దిన అమ్మ గురించి చెప్పాలి. అక్కాతమ్ముళ్లు ఆర్.ప్రజ్ఞానంద (18), ఆర్.వైశాలీ (22) చదరంగ పోటీల్లో ప్రపంచం మెచ్చిన క్రీడాకారులుగా కీర్తిపతాకాలు అందుకుంటున్న వేళ.. వారి ప్రతి అడుగులో తోడుంటూ విజయ తీరాలకు నడిపించిన ఆ అమ్మ తమిళనాడుకి చెందిన ఆర్. నాగలక్ష్మి.

మధ్యతరగతి కుటుంబానికి చెందిన నాగలక్ష్మి సాధారణ గృహిణి. భర్త రమేష్ బ్యాంకు ఉద్యోగి. భర్త, బిడ్డలు ఇదే ఆమె ప్రపంచం. వైశాలికి ఐదేళ్లప్పుడు టీవీ బాగా చూస్తుందని చెస్ బోర్డు కొనిచ్చారు నాగలక్ష్మి దంపతులు. అలా చదరంగం క్రీడవైపు ఆమె మనసు మళ్లించాలని భార్యాభర్తలిద్దరూ అనుకున్నారు. తండ్రి నేర్పించిన మెళకువలకు తన ఆసక్తి తోడై వైశాలీ చాలా త్వరగానే చెస్ ఆట నేర్చుకుంది. ఆ తరువాత ఆ బాధ్యత నాగలక్ష్మి తీసుకుంది. అమ్మ ప్రోత్సాహంతో వైశాలి, ఆటపై పట్టు సాధించింది. ఆట నేర్పించడం, అందుకు అవసరమైన వసతులు సమకూర్చడం, స్కూలుకు తీసుకెళ్లడం, చదువులో ముందుండేలా సాయం చేయడం నాగలక్ష్మి దినచర్యగా మారిపోయింది. కొన్ని రోజులకు కూతురుతో పాటు కొడుకు కూడా అదే పనిగా ఆటను చూస్తుంటే ఎంతో మురిసిపోయింది. ఈసారి కొడుకుకి కూడా ఆట నేర్పించింది. చదువు, చదరంగం రెండింట్లో రాణిస్తున్న పిల్లలను చూసి తెగ సంబర పడిపోయేది ఆ అమ్మ.

'చదరంగ క్రీడలో పిల్లలిద్దరూ ఆసక్తి చూపుతున్నా శిక్షణా తరగతులకు పంపించే స్తోమత మాకు లేదు. మొదట వైశాలి ఆసక్తి కనబరిచినప్పుడే మేము ఓ నిర్ణయం తీసుకున్నాం. ఆ తరువాత ప్రజ్ఞానంద కూడా అక్క బాటలో నడుస్తుంటే ఏం చేయాలో పాలుపోలేదు. పిల్లల ఇష్టాలను తీర్చలేని తల్లిదండ్రులుగా మిగిలిపోతామేమోనని భయపడ్డాం. కానీ పిల్లల నైపుణ్యాలు చూసి, దాతలు సాయం అందించారు. స్కూలు యాజమాన్యం ఉచిత చదువు అందించింది. అలా ఎంతోమంది మాట సాయం, ఆర్థిక సాయంతో బిడ్డలు ఎదిగారు' అంటున్న తండ్రి రమేష్ బాబు పోలియో బాధితుడు. బ్యాంకులో చిరు ఉద్యోగి. అయినా బిడ్డల కోసం పరితపించాడు. అయితే ఈ గొప్పతనమంతా భార్య నాగలక్ష్మికే చెందాలంటాడు.

టోర్నమెంట్లకు వెళ్లినప్పుడల్లా పిల్లలతో పాటు నాగలక్ష్మి వెళ్లేది. 'పిల్లలు బాగా చిన్నవాళ్లు.. వెళ్లిన చోట వాళ్లకి అక్కడి ఆహారం పడక ఆరోగ్యం దెబ్బతింటుందని, ప్రయాణంలో నాతోపాటు, ఓ గ్యాస్ స్టవ్, కొంచెం బియ్యం, పప్పు తీసుకెళ్లేదాన్ని. అన్నం, సాంబారు వండిపెట్టేదాన్ని. వాళ్లు ఎంత ఎదిగినా నా కంటికి చిన్నపిల్లల్లానే కనబడతారు. అందుకే శ్రమ అనుకోకుండా వాళ్లతో పాటే వెళ్లిపోతాను' అంటూ ఆమె చెబుతున్నప్పుడు, బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ చూపే ఎందరో తల్లులు మనకు కనపడతారు.

ఆటలో అక్కాతమ్ముళ్లు

చదరంగ క్రీడలో మొట్టమొదటిసారి అక్కాతమ్ముళ్లిద్దరూ గ్రాండ్‌మాస్టర్లైన రికార్డు వైశాలీ, ప్రజ్ఞానందకే సొంతం. అయితే ఎవరికి వారికే ప్రత్యేక రికార్డులు కూడా ఉన్నాయి. బాల్యం నుండీ ప్రజ్ఞానంద రికార్డులు బద్దలుకొడుతున్నాడు. జాతీయ అవార్డులు కూడా సొంతం చేసుకున్నాడు. తాజాగా డిసెంబరు 1న స్పెయిన్‌లో జరిగిన ఈవెంట్‌లో వైశాలీ పాల్గొని, 2500 ఎఫ్‌ఐడిఇ రేటింగ్స్‌ని అధిగమించి కోనేరు హంపి, హారికా ద్రోణవల్లి తరువాత ఇండియా నుండి ఎన్నికైన మూడవ మహిళా గ్రాండ్‌మాస్టరుగా నిలిచింది. తన సొంత రాష్ట్రం తమిళనాడు నుండి ఎంపికైన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించింది.

ఈ ఏడాది జరిగిన ప్రపంచ చదరంగ పోటీల్లో ప్రజ్ఞానంద రన్నరప్‌గా నిలిచినప్పుడు 'అక్క వైశాలిని చూసి తాను చదరంగం నేర్చుకున్నా'నని చెప్పాడు. అప్పుడే వైశాలి గురించి ఆరా తీసిన వారందరూ ఆశ్చర్యపోయారు. తమ్ముడి కంటే ముందే వైశాలీ చదరంగ పోటీల్లో రాణించింది. 2015 ఆసియన్ యూత్ చెస్ ఛాంపియన్‌షిప్ అండర్-14 క్యాటగిరీలో విజయం సాధించింది. ఈ విజయం ఆమెని ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) బిరుదును అందించడంలో కీలకపాత్ర పోషించింది. ఎనిమిదేళ్ల తరువాత, అంతర్జాతీయ మాస్టరు నుండి గ్రాండ్ మాస్టరుగా ఎదిగింది. ప్రజ్ఞానంద ఎఫ్‌ఐడిఇ వరల్డ్‌కప్ నుండి తిరిగివచ్చిన కొన్నిరోజులకే ఎఫ్‌ఐడిఇ గ్రాండ్ స్విస్ ఈవెంట్‌లో పాల్గొని విజయం సాధించింది వైశాలి. అలా ఇప్పుడు జరిగిన మహిళా అభ్యర్థుల టోర్నమెంట్‌కు అర్హత సాధించింది.

'నేను చదరంగం ఆడడం ప్రారంభించిన నాటి నుండే గ్రాండ్ మాస్టర్ (జీఎం) కావాలని లక్ష్యం పెట్టుకున్నాను. ఇప్పుడు సాధించాను. చాలా సంతోషంగా ఉంది' అని గ్రాండ్ మాస్టర్‌గా అవతరించిన తరువాత వైశాలీ తన ఆనందాన్ని వెల్లిబుచ్చింది. ఈ బిడ్డలు సాధించిన ఘనత చూసి నాగలక్ష్మి తను పడ్డ శ్రమంతా మర్చిపోయి, ఎంతో సంబరపడిపోతోంది. అమ్మ అంటే అంతేగా..!



చలివేళ వెచ్చని దుప్పటి

రోజురోజుకూ చలిగాలులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ చలి నుంచి రక్షణ నిమిత్తం ప్రత్యేకంగా దుస్తులు ధరించాల్సి వుంటుంది. రాత్రిళ్లు చలి నుంచి వెచ్చదనం కోసం పిల్లలు, వృద్ధులు దుప్పట్లు కప్పుకోకపోతే చలిని భరించలేరు. నేడు అన్ని ప్రాంతాల్లోనూ మార్కెట్లలో తేలికపాటి దుప్పట్లు, రగ్గులు దొరుకుతున్నాయి. మార్కెట్లో లభిస్తున్న కొన్ని దుప్పట్ల గురించి తెలుసుకుందాం.

ఎలక్ట్రిక్ బ్లాంకెట్స్ : కరెంట్ ఛార్జింగ్‌తోపాటుగా మాన్యువల్‌గా కూడా హీట్ కంట్రోల్‌తో ఇవి పనిచేస్తాయి. నాణ్యమైన ఎలక్ట్రిక్ బ్లాంకెట్లను మాత్రమే ఎంచుకోవాలనీ, లేనిపక్షంలో షార్ట్ సర్క్యూట్‌తోపాటు హీట్ ఎక్కువైతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సాఫ్ట్, బెస్ట్ బ్యాంకెట్స్ : తేలికపాటి ఉన్ని, ఫైబర్ దుప్పట్లు సైతం చలిని ఆపగలిగేవి ఉంటాయి. సాఫ్ట్ బ్యాంకెట్స్‌గా కూడా వీటిని పిలుస్తారు. చాలా తక్కువ ధరల్లోనూ దొరుకుతుంటాయి. దూర ప్రయాణాలు చేయాలనుకునే వారు ఈ దుప్పట్లను తీసుకెళ్తే తేలిగ్గా ఉంటాయి. చలినుంచి రక్షణకు దోహదపడతాయి.

సింగిల్ బెడ్ బ్యాంకెట్ : ఇది నాలుగు రంగుల సింగిల్ బెడ్ బ్యాంకెట్‌లతో కూడి గొప్ప కాంబో ప్యాక్. నాలుగు విభిన్న రంగులను కలిగివుంటుంది. మంచి ఉన్నితో చాలా మృదువుగా ఉంటాయి. ఒక్కో దుప్పటి 400 గ్రాముల వరకూ బరువు ఉంటుంది. చిన్న పిల్లలకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఏసి బ్యాంకెట్ : ఇది పోరార్ ఫ్లీస్ సింగిల్ బెడ్ బ్లాంకెట్. ఏసి గదికి చాలా బాగుంటుంది. శీతాకాలంలో టీవీ చూసేటప్పుడు కూడా ఈ దుప్పటిని వినియోగించొచ్చు. ఇది చూడటానికి చాలా అందంగా ఉంటుంది.

లైట్ వెయిట్ సూపర్ సాఫ్ట్ లగ్జరీ బ్లాంకెట్ : ఇది తేలిగ్గా,మృదువుగా ఉంటుంది. ఇది ఏసి గదికి, సోఫాలో కూర్చుని టివి చూస్తున్నప్పుడు ఉపయోగించటానికి బాగుంటుంది. ఈ తేలికపాటి దుప్పటి పరిమాణం 90 అంగుళాల పొడవు, 78 అంగుళాల వెడల్పు ఉంటుంది.

ఆల్ సీజన్ పోరల్ ఫ్లీ బ్లాంకెట్ : ఇది అన్ని సీజన్లలోనూ ఉపయోగించటానికి అనువుగా ఉంటుంది. దీనిలోని ఫ్యాబ్రిక్ పాలిస్టర్ చాలా వెచ్చని అనుభూతిని అందిస్తుంది. సౌకర్యవంతంగా ఉంటుంది. ఈ దుప్పటిని మెషిన్ వాష్ కూడా చేసుకోవచ్చు.

ఖర్చు ఆధారంగానే కేటాయింపులు

- బడ్జెట్ మార్గదర్శకాలు విడుదల
- పెట్టుబడి వ్యయానికి ప్రాధాన్యత



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రస్తుత సంవత్సరంలో చేసిన ఖర్చు ఆధారంగానే వివిధ శాఖలకు రానున్న ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బడ్జెట్ మార్గదర్శకాలను పేర్కొంటూ ఆర్థికశాఖ సోమవారం జిఓను విడుదల చేసింది. సాధారణ ఎన్నికలు జరగనుండటంతో రానున్న ఆర్థిక సంవత్సరపు మొదటి మూడు నెలల కాలానికి ఓట్‌ఆన్‌అక్కౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన కసరత్తును జనవరి కల్లా పూర్తి చేయాలని వివిధ శాఖలను తాజా ఉత్తర్వుల్లో ప్రభుత్వం వివిధ శాఖలను ఆదేశించింది. పెట్టుబడి వ్యయానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న విమర్శల నేపథ్యంలో ఓట్‌ఆన్‌అక్కౌంట్ బడ్జెట్‌లో దానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొనడం విశేషం. సంక్షేమ పథకాలకు నిధులు ప్రతిపాదించే సమయంలో మ్యానిఫెస్టోలో పొందుపరిచిన పథకాలపై కూడా జాగ్రత్తగా ప్రతిపాదనలు పంపించాలని నిర్దేశించింది. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే అభివృద్ధి పథకాల నిధులు, నబార్డ్, ఇతర సంస్థల నుంచి వచ్చే పథకాల నిధులకు కూడా బడ్జెట్‌లో పొందుపరచాలని ఆర్థికశాఖ సూచించింది. ఈ పథకాలకు సంబంధించి నిర్దిష్టమైన నమూనాల్లో ప్రతిపాదనలను పంపించాలని పేర్కొంది.

ప్రస్తుత ధరల మేరకు పన్నుల ఆదాయం

పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రతిపాదించే సమయంలో తీసుకోవాల్సిన చర్యలపైనా ప్రత్యేకంగా ఆర్థికశాఖ స్పష్టతనిచ్చింది. ప్రస్తుత ధరల మేరకు పన్నుల ఆదాయాన్ని ప్రతిపాదించాలని నిర్దేశించింది. పస్తుతం ఉన్న చట్టాలమేరకు పన్నులు, లెవీ, ఇతర రంగాల ఆదాయాన్ని గణించాలని పేర్కొంది. అదే సమయంలో పన్నేతర ఆదాయం కొన్ని సంవత్సరాలుగా తగ్గుతోందని, దానిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. పాలనా వ్యయంపైనా దృష్టి సారించాలని నిర్దేశించింది. ప్రధానంగా భవనాల నిర్వహణ, అద్దె వాహనాలు, ప్రభుత్వ సొంత వాహనాల నిర్వహణ, జీతాలు, ఇతర వ్యయం వంటి వాటిపైనా స్పష్టంగా ప్రతిపాదనలు ఉండాలని పేర్కొంది. ఈ విషయంలో గత మూడేళ్ల వివరాలను అధ్యయనం చేయాలని పేర్కొంది.

మౌలికాభివృద్ధిపై ఫోకస్

మౌలికాభివృద్ధిపై ప్రభుత్వం ఫోకస్ పెడుతోందని, అందుకే కొత్త బడ్జెట్‌లో ఈ అంశంపై దృష్టి సారించాలని ఆర్థికశాఖ పేర్కొంది. ప్రాంతాల అనుసంధానం, గృహనిర్మాణం, తాగునీరు, విద్య, ఆరోగ్యం వంటి రంగాలపై బడ్జెట్‌లో సరైన ప్రతిపాదనలు ఉండాలని నిర్దేశించింది. లక్ష్యాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, కేంద్ర నిధులు, రాష్ట్ర అభివృద్ధి నిధులు, నబార్డ్, హడ్కో వంటి సంస్థల నుంచి వచ్చే సాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొంది.

ఎన్నికలపై మణిపూర్ అల్లర్ల ప్రభావం

ఎన్‌డిఎలో ఉండటమే ఎంఎన్‌ఎఫ్ ఓటమికి కారణం

ఐజ్వాల్: పొరుగున ఉన్న మణిపూర్‌లో జాతుల, మతపరమైన అల్లర్లు, మయన్మార్ శరణార్థుల సమస్య మిజోరం ఎన్నికలపై నిర్ణయాత్మక ప్రభావాన్ని చూపాయి. అల్లర్ల నేపథ్యంలో మణిపూర్ నుంచి వచ్చిన చాలా మంది ప్రజలు మిజోరంలో ఆశ్రయం పొందారు. సైనిక తిరుగుబాటు తరువాత మయన్మార్ నుంచి వచ్చిన 50,000 మందికి పైగా చిన్ శరణార్థులు మిజోరంలో ఆశ్రయం పొదారు. వీరిలో ఎవరికీ రాష్ట్రంలో ఓటు హక్కు లేదు. మణిపూర్ శరణార్థులపై ఆంక్షలు విధించినప్పుడు మిజోరం బహిరంగ విధానాన్ని అవలంభించింది. శరణార్థుల బయోమెట్రిక్ సమాచారాన్ని నమోదు చేసే కేంద్ర ప్రభుత్వ వైఖరిపై అసంతృప్తి వ్యక్తమైంది. ఎన్‌డిఎ కూటమిలో భాగమైనప్పటికీ ఎంఎన్‌ఎఫ్ మీసో సెంటిమెంట్‌కు అండగా నిలిచింది. 'చిన్ ప్రజలు మా సోదరులు. వారికి ఆశ్రయం కల్పించాలి' అని మిజోరం ముఖ్యమంత్రి జోరంతంగ స్పందించారు.

మణిపూర్‌లో కుకీ, మైతీల ఘర్షణల సమయంలో కుకీలు జో తెగకు చెందిన వారనే కారణంతో వారికి మిజోరం ప్రభుత్వం ఆశ్రయం కల్పించింది. మణిపూర్ అల్లర్లలో బిజెపి వైఖరిపై ఎంఎన్‌ఎఫ్ అసంతృప్తిగా ఉంది. 2018లో బిజెపి 39 స్థానాల్లో పోటీ చేసి ఒక్కటి గెలుచుకోగా, ఈసారి 28 స్థానాల్లో పోటీ చేసి రెండు స్థానాల్లో గెలిచింది.

కొత్త పార్టీకి అవకాశం

1987లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి మిజోరంలో ఇప్పటి వరకు మిజో నేషనల్ ఫ్రంట్ (ఎన్ఎంఎఫ్), కాంగ్రెస్ మారుతూ పాలించాయి. గత ఎన్నికలు (2018) వరకు కాంగ్రెస్, ఎంఎన్‌ఎఫ్ ప్రధాన రాజకీయ ప్రత్యర్థులు. 2018లో 40 అసెంబ్లీ స్థానాల్లో 26 స్థానాలను గెలుచుకుని ఎంఎన్‌ఎఫ్ అధికారంలోకి వచ్చింది. దీంతో దేశ రాజకీయ చరిత్రలో తొలిసారిగా ఈశాన్య రాష్ట్రాల్లో ఒక్కదానిలో కూడా కాంగ్రెస్ అధికారంలో లేకుండా పోయింది. జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ ఎనిమిది స్థానాల్లో విజయం సాధించి రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. 2019లో జెడ్‌పిఎంను ఎన్నికల సంఘం రాజకీయ పార్టీగా గుర్తించింది. ఈశాన్య రాజకీయాల్లో, మిజోరంలో కొత్త రాజకీయ పార్టీ జెడ్‌పిఎం అధికారాన్ని సొంతం చేసుకుంది. అన్ని స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గతసారి ఐదు సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్, ఈసారి ఒక్క సీటుతో సరిపెట్టుకుంది. జెడ్‌పిఎం ఓట్ల శాతం భారీగా పెరిగింది. మణిపూర్, మయన్మార్‌ల నుంచి మిజోరంలో ఆశ్రయం పొందుతున్న వారికి రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి జోరంతంగ నిర్ణయించినప్పటికీ, ఎన్‌డిఎతో పొత్తు వల్ల మసకబారింది.

కొత్త సారథి లాల్ దహోమా..!

జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీని నడిపిస్తున్న 79 ఏళ్ల లాల్ దహోమా గతంలో ఐపిఎస్ అధికారిగా పని చేశారు. గోవాలో జీవితం ప్రారంభించిన దహోమా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ భద్రతా ఇన్‌ఛార్జ్‌గా విధులు నిర్వర్తించారు. 1972 నుండి 1977 వరకు మిజోరం ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ అసిస్టెంట్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఉద్యోగాన్ని వదులుకుని కాంగ్రెస్ పార్టీ తరపున 1984లో లోక్‌సభలో అడుగుపెట్టారు. అనంతరం కాంగ్రెస్ పార్టీని వీడి దేశంలో ఫిరాయింపుల నిరోధక చట్టంపై అనర్హత వేటు పడిన మొదటి ఎంపిగా నిలిచారు. 2017లో జోరామ్ నేషనలిస్ట్ పార్టీ స్థాపించి ఆ తర్వాత జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ కూటమిలో చేరారు. 2018లో ఆ కూటమి తరపున ముఖ్యమంత్రి అభ్యర్థిగా రంగంలోకి దిగి ఓటమి చవి చూశారు. 2021లో మళ్లీ ఎంపిగా పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. ప్రస్తుత ఎన్నికల్లో జెడ్‌పిఎం విజయం సాధించడంతో, లాల్ దహోమానే ముఖ్యమంత్రి కానున్నారు.

విదేశీ గడ్డపైనా రాణించాలి

- మార్‌క్రమ్‌కు వన్డే, టి20 పగ్గాలు
- టెస్ట్‌లకు బవుమా
- భారత్‌తో సిరీస్‌కు దక్షిణాఫ్రికా జట్లను ప్రకటించిన బోర్డు



జొహాన్స్‌బర్గ్: ఐసిసి వన్డే ప్రపంచకప్ అనంతరం డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాపై టి20 సిరీస్ నెగ్గిన టీమిండియా.. దక్షిణాఫ్రికా పర్యటనకు సిద్ధమౌతోంది. ఈ పర్యటనలో భాగంగా సఫారీలతో మూడు ఫార్మాట్‌లలో తలపడే భారత జట్టుకు ముగ్గురు కెప్టెన్లతో బయల్దేరి వెళ్లనుంది. ఆసీస్‌తో జరిగే ఐదో, చివరి టి20లో టీమిండియా బౌలర్లు అద్భుతంగా రాణించారు. యువ స్పిన్నర్ రవి బిష్ణోయ్ ఆసీస్‌ను కట్టడి చేసిన అత్యద్భుతం. త్వరలో టి20 ప్రపంచకప్ ఉన్న దృష్ట్యా మూడో స్పిన్నర్ కోటాలో అతడు ముందంజలో ఉన్నాడు. ఇక సఫారీ పర్యటనకు వెళ్లే భారతజట్టుకు రోహిత్ శర్మ టెస్టు కెప్టెన్‌గా, టి20లకు సూర్యకుమార్ యాదవ్, వన్డేల్లో కేఎల్ రాహుల్‌ను సారథిగా బిసిసిఐ నియమించింది. కొంతకాలంగా టీ20లకు కెప్టెన్‌గా ఉంటున్న హార్దిక్ పాండ్య గాయం కారణంగా అందుబాటులో లేని కారణంగా సూర్య కుమార్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. దక్షిణాఫ్రికాతో వన్డే, టి20 సిరీస్‌లకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి దూరంగా ఉండటంతో కేఎల్ రాహుల్‌ను కెప్టెన్‌గా నియమించారు. మూడు ఫార్మాట్లకు ముగ్గురిని కెప్టెన్‌గా నియమించడంపై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ మండిపడ్డాడు. త్వరలో టి20 ప్రపంచకప్ జరగనున్న దృష్ట్యా ఇదే విధానమంటూ బిసిసిఐని దుయ్యబట్టాడు.

వన్డే, టి20ల్లో బవుమాకు దక్కని చోటు

ఇక భారత్‌తో తలపడే దక్షిణాఫ్రికా జట్టును ఆ దేశ క్రికెట్‌బోర్డు సోమవారం ప్రకటించింది. వన్డే ప్రపంచకప్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన బవుమాకు వైట్‌బాల్ క్రికెట్‌కు దూరం కాగా.. టెస్టులకు మాత్రమే కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇక భారత్‌తో వన్డే, టి20 సిరీస్‌లలో తలపడే దక్షిణాఫ్రికా జట్టుకు మార్క్‌క్రమ్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. పరిమిత ఓవర్ల సారథిగా చాలాకాలంగా కొనసాగుతున్న టెంబా బవుమాను సఫారీ సెలక్టర్లు పక్కనబెట్టారు. టీ20 ప్రపంచ కప్ కొద్ది నెలల్లో జరగనున్న దృష్ట్యా ఈ ఫార్మాట్‌కు సంబంధించిన ప్లేయర్లనే ఎక్కువగా ఎంపిక చేసింది. కానీ ఆ జట్టు యువ ఆటగాడు డెవాల్డ్ బ్రెవిస్‌ను మాత్రం పక్కనబెట్టడం గమనార్హం. బవుమాను పరిమిత ఓవర్ల సారథ్య బాధ్యతల నుంచే గాక ఈ రెండు సిరీస్‌ల నుంచి కూడా బోర్డు తప్పించింది. బవుమాతో పాటు రబాడాను కూడా పరిమిత ఓవర్ల సిరీస్ నుంచి సెలక్టర్లు విశ్రాంతినిచ్చారు.

దక్షిణాఫ్రికా జట్లు..

టి20: మార్క్‌క్రమ్ (కెప్టెన్), బార్ట్‌మన్, మాథ్యూ బ్రీట్జ్, బర్గర్, కోయెట్జ్, అండిల్ పెహ్లుక్వాయో, షాంసీ, స్టబ్స్. డొనొవన్ ఫెరీరా, హెండ్రిక్స్, క్లాసెన్, కేశవ్ మహారాజ్, డేవిడ్ మిల్లర్, తొలి రెండు టి20లకు: లిజాడ్ విలియమ్స్, మార్కో జాన్సెన్, లుంగి ఎంగిడి.

వన్డేలు: మార్క్‌రమ్(కెప్టెన్), బార్ట్‌మన్, బర్గర్, జోర్జి, హెండ్రిక్స్, క్లాసెన్, మహారాజ్, ఎంపగ్వానా, మిల్లర్, మల్డర్, పెహ్లుక్వాయో, షాంసీ, వాన్‌డెర్-డసెన్, వెర్రెయెన్, విలియమ్స్.

టెస్టులకు: బవుమా(కెప్టెన్), బెడింగ్హమ్, బర్గర్, కొయెట్జ్, టోని-డి-జోర్జి, ఎల్గర్, జాన్సెన్, కేశవ్ మహారాజ్, మార్‌క్రమ్, మల్డర్, ఎంగిడి, పీటర్సన్, రబాడా, స్టబ్స్, వెర్రెయెన్.

భారత్ × దక్షిణాఫ్రికా సిరీస్..

టి20 సిరీస్..
10(ఆది) : తొలి టి20(డర్బన్)
12(మంగళ) : రెండో టి20(సెయింట్‌జార్జెస్)
14(గురు) : మూడో టి20(జొహన్నెస్‌బర్గ్)

వన్డే సిరీస్..
17(ఆది) : తొలి వన్డే(జొహన్నెస్‌బర్గ్)
19(మంగళ) : రెండో వన్డే(సెయింట్‌జార్జెస్)
21(గురు) : మూడో వన్డే(పార్ల్)

టెస్ట్ సిరీస్..
26-30 : తొలిటెస్ట్(సెంచూరియన్)
జనవరి 3-7 : రెండోటెస్ట్(కేప్‌టౌన్)



తుపానుతో స్టేడియాన్ని కప్పి ఉంచిన దృశ్యం

లెజెండ్స్ మ్యాచ్ రద్దు

తదుపరి ఆటలకు సూరత్ పయనం

ప్రజాశక్తి -పిఎం పాలెం (విశాఖపట్నం)

లెజెండ్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం జరగాల్సిన మ్యాచ్ రద్దయింది. విశాఖ పిఎం పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు మణిపాల్ టైగర్స్, అర్బన్ రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉండగా మిచౌంగ్ తుపాను కారణంగా ఈ మ్యాచ్‌ను రద్దు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. టోర్నమెంట్‌లో భాగంగా తదుపరి మ్యాచ్‌లు ఆడేందుకు క్వాలిఫై అయిన గుజరాత్ జైంట్స్, మణిపాల్ టైగర్స్, అర్బన్ రైజర్స్ హైద రాబాద్, ఇండియా క్యాపిటల్ జట్లు సూరత్‌కు బయలుదేరి వెళ్లాయి. ఈ నెల రెండో తేదీన ఇండియా క్యాపిటల్-మణిపాల్ టైగర్స్, మూడున గుజరాత్ జైంట్స్ - సదరన్ సూపర్‌స్టార్స్ జట్లు తలపడిన విషయం తెలిసిందే.

డిఫెండింగ్ ఛాంపియన్‌కు షాక్

తొలి మ్యాచ్‌లో పుణేరి పల్టన్స్ చేతిలో ఓటమి

ప్రొ కబడ్డీ సీజన్-10



అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ సీజన్-10 డిఫెండింగ్ ఛాంపియన్ జైపూర్ పింక్ ప్యాంథర్స్ జట్టు తొలి లీగ్ మ్యాచ్‌లోనే పరాజయాన్ని చవిచూసింది. ఉత్కంఠభరితంలో సాగిన ఈ మ్యాచ్‌లో జైపూర్ జట్టు 33-38పాయింట్ల తేడాతో పుణేరి పల్టన్స్ చేతిలో ఓడింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి ఆధిక్యతలో నిలిచిన జైపూర్ జట్టు రెండో అర్ధభాగంలో ఆశించినస్థాయిలో రాణించలేకపోయింది. జైపూర్ రైడర్ అర్జున్(17పాయింట్లు) ఒంటరిపోరాటం చేసినా ప్రయోజనం లేకపోయింది. ముఖ్యంగా రెండో అర్ధభాగంలో జైపూర్ ట్యాకిల్స్‌లో వెనుకంజ వేసింది. ఇక పుణేరి జట్టులో అస్లామ్(10పాయింట్లు), మోహిత్ గోయట్(8) ట్యాకిల్స్‌లో రాణించారు.

ప్రొ కబడ్డీలో నేడు..
తెలుగు టైటన్స్ × పట్నా వారియర్స్(రా.8.00గం॥)
యుపి యోథాస్ × హర్యానా స్టీలర్స్(రా.9.00గం॥)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68